


బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ కార్యాలయం వద్ద వైస్ చైర్మన్ల ఎన్నిక కోసం చేస్తున్న ఏర్పాట్లు



నేడు డిప్యూటీ మేయర్ ఎన్నిక

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఎన్ఎంసీ కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన భద్రత
- బుచ్చిలోనూ నేడే వైస్‌చైర్మన్ల ఎన్నిక
- కౌన్సిల్ హాలులో పకడ్బందీగా ఏర్పాట్లు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 2,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక నేడు(సోమవారం) నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్ఎంసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 గంటలకు కౌన్సిల్ హాల్లో ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే కార్పొరేటర్లు, ఓటు హక్కునున్న ప్రజాప్రతినిధులకు సమాచారం అందచేశారు. 54 మంది కార్పొరేటర్లలో డిపూటీ మేయర్‌గా ఉన్న ఖలీల్‌అహ్మద్ రాజీనామా చేయడంతో ఆ సంఖ్య 53కి చేరింది. వీరిలో 41 మంది అధికార టీడీపీలో ఉండగా, ప్రతిపక్ష వైసీపీలో 12 మంది మాత్రమే ఉన్నారు. అటు టీడీపీ, ఇటు వైసీపీ నేడు జరిగే డిప్యూటీ మేయర్ ఎన్నికకు సిద్ధం కావడంతో కార్పొరేషన్ కార్యాలయం వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అనుమతి ఉన్నవారినే లోపలకు పంపనున్నారు. ఈ ఎన్నిక నేపథ్యంలో అధికార పార్టీలో మంత్రులు, ఎమ్మెల్యే, కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించి అనుసరించాల్సిన వ్యూహంపై దిశనిర్దేశం చేశారు. ఇటు వైసీపీలో సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా కరీముల్లాకు బీఫాం అందచేశారు. పార్టీ విప్‌గా మరో కార్పొరేటర్ నాగార్జున్‌కు బాధ్యతలు అప్పగించారు.

● నేడు పీజీఆర్ఎస్ రద్దు

నగర కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఎన్నిక జరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

బుచ్చిలో నేడే వైస్ చైర్మన్ల ఎన్నిక

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి) : బుచ్చి నగర పంచాయతీ వైస్ చైర్మన్ల ఎన్నికలు సోమవారం కౌన్సిల్‌హాల్‌లో జరగనున్నాయి. ఎన్నికల ప్రొసీడింగ్ అధికారిగా డీపీవో శ్రీధర్‌రెడ్డి వ్యవహరించనున్నారు. ఈ మేరకు కౌన్సిల్ హాల్ లోనూ, నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.. ముగ్గురు సీఐలు, ఆరుగురుఎస్సైలు, 50మంది పోలీ సులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మున్సిపల్ సిబ్బంది 30 మంది, కౌన్సిలర్లు 20మంది, ఎమ్మెల్యేను, అనుమతి ఉన్న విలేకరులకు లోపలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

● వైసీపీ విప్‌గా షాహుల్

వైస్ చైర్మన్ల ఎన్నికలపై నిన్నటి వరకు స్తబ్దుగా ఉన్న వైసీపీ నేతలు ఆదివారం రంగంలోకి దిగారు. ఆపార్టీకి చెందిన ఐదో వార్డు కౌన్సిలర్ ఎస్కే.షాహుల్‌ను విప్‌గా నియమించారు. కాగా 12, 16 వార్డుల కౌన్సిలర్లు యానాదిరెడ్డి, ప్రమీలమ్మను వైస్ చైర్మన్ల అభ్యర్థులుగా ప్రకటించారు.

రెచ్చిపోతున్న అల్లరి మూకలు

- దుకాణాల వద్ద దాదాగిరి
- ఎదిరిస్తే దాడులకు తెగబడుతున్నవైనం
- అర్ధరాత్రి వేళ కారు అద్దాల ధ్వంసం
- గంజాయి మత్తులోనే దాడులు
- చేష్టలుడిగి చూస్తున్న పోలీసులు
- భయాందోళనకు గురవుతున్న నగర వాసులు


● నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని సాయిబాబా గుడి ప్రాంతంలో ఇటీవల గంజాయి మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. ఆ ప్రాంతంలోని వ్యాపార దుకాణాల వద్దకు వెళ్లి దౌర్జన్యం చేశాడు. 'తానో పెద్ద రిస్కర్‌ను అని, అడిగినవి ఇవ్వకుంటే అంతుచూస్తా'నని బెదిరించాడు. సామాన్య వ్యాపారులు ఆ రౌడీషీటర్ జోలికి వెళ్లలేక భయంతో కాలం గడుపుతున్నారు.

● ఐదు రోజుల క్రితం అదే ప్రాంతంలోని ఓ దుకాణం వద్దకు కొందరు అల్లరిమూకలు వెళ్లి రౌడీయిజం చేస్తుండగా ఓ దుకాణం యజమాని ఎదురుతిరిగాడు. దీంతో వారి మధ్య పెద్ద గొడవ జరిగింది. ఆ యువకులు విచక్షణ కోల్పోయి పక్కనే ఉన్న టెంకాయలు నరికే కత్తితో దుకాణం యజమానిని నరికేందుకు ప్రయత్నించారు. చుట్టుపక్కల వారు అప్రమత్తమవ్వడంతో ప్రమాదం తప్పింది. ఆ తర్వాత ఆ అల్లరిమూకే బ్లేడుతో గొంతు కోసుకొని తన చావుకు ఆ దుకాణం యజమాని కారణమంటూ నానా రభస సృష్టించారు. పోలీసులు వచ్చి సర్దిచెప్పారు తప్ప... ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

● నగరంలోని బీవీనగర్ ప్రాంతంలో కొందరు ఆకతాయిలు ఓ ముఠాగా ఏర్పడి ఇటీవల అర్ధరాత్రి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వీరిలో కొందరు రౌడీషీటర్లు కూడా ఉండడం గమనార్హం. రాత్రిళ్లు మద్యం తాగి రోడ్లపై వెళ్లే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. సంక్రాంతి పండుగనాడు ఈ ఆకతాయిల ముఠా వీధుల్లో ఉన్న కార్ల అద్దాలు ధ్వంసం చేసింది. సుమారు పది కార్ల అద్దాలను పగలగొట్టింది. ఆ వీడియోలు కూడా బయటకు వచ్చాయి. మరికొంతమంది ఆకతాయిలు ఉదయం, సాయంత్రం వేళల్లో కేఎన్ఆర్ పాఠశాల వద్ద తిష్ఠ వేస్తూ పాఠశాలకు వచ్చిపోయే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు.ఈ విషయాలను బయటకు చెప్పుకోవాలంటే వారు భయపడుతున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)


ఇవే కాదు.. ఇలాంటి సంఘటనలు ఇటీవల నెల్లూరు నగరంలో ఎక్కువయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇలాంటి అరాచకాలు అధికంగా జరిగేవి. అవి ఇంకా కొనసాగుతుండడం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. ప్రశాంతతకు మారుపేరైనా సింహపురి గడ్డపై కొందరు అల్లరిమూకలు హల్‌చల్ చేస్తున్నారు. వీరిలో కొందరు రౌడీషీటర్లు ఉంటుండగా, మరికొందరు ఇప్పుడిప్పుడే రౌడీషీటర్లుగా రూపాంతరం చెందే స్థాయిలో ఉన్నారు. రోడ్లపై వీరు చేస్తున్న రచ్చ అంతా ఇంతా కాదు. బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా ఏర్పడడం, రోడ్లపై వెళ్లే వారిపట్ల అసభ్యకరంగా కామెంట్లు చేయడం అలవాటుగా మారింది. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకు కూడా వెనకాడడం లేదు. ఇంకొందరు ఆకతాయిలైతే వ్యాపార దుకాణాల వద్ద దాదాగిరి చేస్తు న్నారు. తాము అడిగినవి ఇవ్వాలంటూ బెదిస్తున్నారు. రాత్రివేళ రోడ్లపైనే మద్యం సేవిస్తూ స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నారు. ఈ ఆకతాయిల్లో గంజాయి బానిసలే ఎక్కువగా ఉంటున్నట్లు తెలుస్తోంది.



నెల్లూరు నగరంలోని బీవీ నగర్‌లో అర్ధరాత్రి వేళ కారు అద్దాలు ధ్వంసం చేస్తున్న ఆకతాయిల ముఠా(ఫైల్)

● పాత నేరస్థుల అనుచరులుగా..

ఇటీవల నెల్లూరులో జరిగిన పలు హత్యల్లో పాత నేరస్థుల పాత్ర ఉన్నట్లు పోలీసుల విచారణల్లో తేలింది. వారి అనుచరులుగా ఈ ఆకతాయిలు మెలుగుతున్నారు. వీరి ఆగ డాల గురించి పోలీసులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తు తు న్నాయి. ఇటీవల బీవీ నగర్‌లో ఓ ఆకతాయి గంజాయి మత్తులో దుకాణాల వద్ద కత్తి, బ్లేడుతో హల్‌చల్ చేసినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఆకతాయిలను అదుపు చేయకపోతే రేపటి రోజున వీరే రౌడీషీటర్లుగా తయారవుతారన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. రౌడీషీటర్లు, ఆకతాయిల ఆగడాలు పోలీసులకు తెలిసినా వారి జోలికి వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రౌడీషీటర్ల జోలికి వెళితే వెంటనే రాజకీయ నాయకులు రంగంలోకి దిగుతున్నారని, ఇదే ఇబ్బందిగా మారిందంటూ ఓ పోలీసు ఉన్నతాధికారి వ్యాఖ్యానించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



- దెబ్బతిన్న విద్యార్థుల పఠనా సామర్థ్యం
- గత ప్రభుత్వ విద్యా సంస్కరణలే కారణం
- అసర్ నివేదికలో వెల్లడి
- నిపుణుల ఆందోళన

చదవలేరు.. లెక్కలు చేయలేరు !

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం విద్యారంగంలో చేపట్టిన సంస్కరణల కారణంగా విద్యార్థుల పఠనా సామర్థ్యాలు దారుణంగా దెబ్బతిన్నాయి. తాజాగా ప్రథమ్ అనే సంస్థ వెల్లడించిన వార్షిక విద్యా స్థితిగతుల నివేదిక (అసర్-2024) ఈ విషయాన్ని బహిర్గతం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు సగం మంది తెలుగు పాఠాన్ని తప్పులు లేకుండా చదవలేకపోవడం, గణితంలో కూడికలు, తీసివేతలు కూడా చేయలేకపోవడం ఆందోళన కలిగించే అంశంగా నివేదికలో పేర్కొంది.

● సగంమంది కూడా చదవలేరు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులు దాదాపు సగం మంది కూడా రెండోతరగతి పాఠాన్ని తప్పులు లేకుండా చదవలేక పోతున్నారని, కూడికలు, తీసివేతలు, భాగాహారాలు సైతం చేయలేకపోతున్నారని అసర్ సర్వే వెల్లడించింది. జిల్లాలో ఎంపిక చేసిన సుమారు 50కిపైగా గ్రామాల్లో 3 నుంచి 16 ఏళ్ల వయసున్న విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు, 14 నుంచి 16 ఏళ్ల వయసు వారిలో డిజిటల్ అక్షరాస్యతపై సర్వే నిర్వహించి వివరాలు ప్రకటించింది. 3, 4, 5 తరగతులు, 6, 7, 8 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను వేర్వేరుగా పరిశీలించారు. రెండో తరగతి తెలుగు పాఠాలు, భాగాహారాలు, తీసివేతలపై పరీక్షించగా, చిన్నచిన్న పదాలను సైతం చదవలేకపోతున్నారని, తీసివేతలు, భాగాహారాలు కూడా చేయడంలో వెనుకబడి ఉన్నారని గుర్తించింది. 2022-23తో పోలిస్తే 2024లో 6 నుంచి 8వతరగతి విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు బాగా తగ్గాయని పేర్కొంది. 2024 సర్వేప్రకారం 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు 63.3 శాతం మాత్రమే బడికి వెళుతున్నారని, 3, 4, 5 తరగతుల విద్యార్థులు రెండో తరగతి వచనం 27.4శాతం మంది మాత్రమే చదవగా, 52శాత మంది మాత్రమే లెక్కలు చేశారని వెల్లడించింది. అలాగే 6, 7, 8 తరగతి విద్యార్థులను ప్రశ్నిం చగా, 47.7శాతం మంది చదవగా, 33.9శాతం మంది మాత్రమే లెక్కలు చేయగలిగారని, ఇది ఆందోళన కలిగించే అంశ మని పేర్కొంది. విద్యావ్యవ స్థలో మార్పులు చేపట్ట కుంటే విద్యార్థుల పాఠనా సామర్థ్యాలు మరింత దెబ్బతినే ప్రమాద ముందని అసర్ తన నివేదికలో వెల్లడించింది.

ఆకట్టుకున్న డాగ్ షో

- అందాల పోటీకి 106 పెంపుడు కుక్కలు
- జిల్లాకు 26 జాతులకు చెందినవి రాక
- ఓవరాల్ ఛాంపియన్‌గా డాబర్‌మెన్



దర్పం చూపుతున్న పోలీసు జాగిలం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని వీఆర్సీ మైదానంలో ఆదివారం నెల్లూరు కెన్నెల్ క్లబ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా జరిగిన శునకాల అందాల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలకు మొత్తం 106 పెంపుడు కుక్కలను వాటి యజమానులు తీసుకువచ్చారు. 26 జాతులకు చెందిన శునకాల్లో జర్మన్‌షపర్డ్ 30, లాబ్ 13, రాట్‌విల్లర్ 5, షిజ్జు 8, డాబర్‌మెన్ 4, సైబీరియన్ హస్కీ 5, వాక్సస్ 3, స్పిడ్జి జాతి చెందిన మూడు కుక్కలతోపాటు వివిధ జాతుల శునకాలు ప్రేక్షకులను అలరించాయి. జేసీ కే కార్తీక్ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా పశుసంవర్ధకశాఖ జేడీ కే రమేష్‌నాయక్, పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ సోమయ్య హాజరై పోటీలను ప్రారంభించారు. పోటీలకు వచ్చిన శునకాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను ప్రదానం చేశారు. ఈ ఏడాది ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను ఎం.నరేష్ (డాబర్‌మెన్) గెలుచుకున్నారు. పోటీల న్యాయనిర్ణేతలుగా కోయంబత్తూరు నుంచి వచ్చిన డాక్టర్ చుండి శుభకర్, ప్రత్యేక ఆహ్వానితులు భార్గవి ఆటో మొబైల్స్ ఎండీ కొండా నిరంజన్‌రెడ్డి, గౌరవ సలహాదారులు వెంకటస్వామిరెడ్డి వ్యవహరించారు. పాల్గొన్నారు. నెక్ జోనల్ చైర్మన్ ఎన్.బలరామయ్య నాయుడు శునకాలకు ఉడికించిన కోడిగుడ్లను ఉచితంగా అందచేశారు. కార్యక్రమాన్ని కెన్నల్ క్లబ్ చైర్మన్ బొబ్బా శ్రీనివాసయాదవ్, కార్యదర్శి బీ సురేంద్రకుమార్, కోశాధికారి ఐ.రాజా, డాక్టర్లు జయచంద్ర, రమణయ్య, తదితరులు పర్యవేక్షించారు.





పోటీలకు వచ్చిన శునకాలను తిలకిస్తున్న నగర వాసులు


'రెవెన్యూ'లో ఏజెంట్లు

- మామూళ్ల వసూళ్ల కోసం ఏర్పాటు
- ఏసీబీకి దొరక్కుండా ఆర్ఐల కొత్తమార్గం
- కొత్త భవనానికి రూ. 50వేలు, పేరు మార్పిడికి రూ. 30వేలు
- ముక్కుపిండుతున్న కొత్త అధికారులు
- డివిజన్లలో హడలెత్తిపోతున్న ప్రజాప్రతినిధులు

నెల్లూరు నగర కార్పొరేషన్‌లో నిన్న,మొన్నటి వరకు ఉన్న ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టరు)లు గుడిని మింగితే.. వారి స్థానంలో కొత్తగా వచ్చినవారు గుడితోపాటు గుళ్లో లింగాన్ని కూడా మింగుతున్నారు. గతంలో పదిమంది ఆర్ఐలు 54 నగర డివిజన్లకు ఉండగా, వారి స్థానంలో ఆరుగురిని నియమించారు. వీరంతా ఈ పోస్టులకు కొత్తవారే అయినా విపరీతంగా మామూళ్లకు పాల్పడుతున్నారు. కొత్త భవనాలకు అసెస్‌మెంట్ వేయాలంటే ఏకంగా రూ. 50 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు.ఇళ్ల క్రయవిక్రయాల్లో ఒకరి పేరుపై ఉన్న ఇంటిపన్నును మరొకరి పేరులోకి మార్చడానికి రూ. 30 వేలు తీసుకుంటున్నారు. కాగా ఇళ్లకు తక్కువ పన్ను వస్తుందని ఆయా యజమానులను బెదిరించి, అందినకాడికి దండుకుంటున్నారు. వీరి అవినీతి దాహానికి ఆయా డివిజన్లలోని ప్రజాప్రతినిధులు కూడా హడలెత్తిపోతున్నారు. ఏసీబీ వరకు వీరి అవినీతి వ్యవహారం వెళ్లడంతో వారెక్కడ పట్టుకుంటారోనని తమ తరపున ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు.

-నెల్లూరు(సిటీ),(ఆంధ్రజ్యోతి)

నెల్లూరు నగరానికి తూర్పు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలకు ఆర్ఐగా ఉన్న ఓ వ్యక్తి రెవెన్యూ విభాగంలో వసూల్‌రాజాగా మారాడు. నిర్మించిన భవనంతో సంబంధం లేకుండా కనిష్ఠంగా రూ. 50 వేలు ఇస్తేనే పన్ను వేస్తానంటూ తెగేసి చెప్తున్నాడు. పన్నులో పేర్లు మార్చాలని ఒకరు ఆయన వద్దకెళ్లగా రూ. 30 వేలు ఇస్తేనే పని జరుగుతుందని స్పష్టం చేశాడు. చివరికి ఆ డివిజన్‌లోని కార్పొరేటర్లు జోక్యం చేసుకుని చెప్పినా ససేమిరా అనడం విశేషం. తూర్పు భాగాన ఇప్పటికే అభివృద్ధి చెందిన మరో ప్రాంతానికి ఆర్ఐగా ఉన్న అధికారి ఖరీదైన భవంతిని ఎంచుకుని, పన్ను పెంచాలంటూ డిమాండ్ చేస్తున్నాడు. తాను అడినంత ఇవ్వకపోతే ఇంటికి తాళం వేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై సదరు ఇంటిలోని మహిళ కమిషనర్‌కు లేఖ రాయడం కార్పొరేషన్‌లో తాజా చర్చనీయాంశంగా మారింది. ఉత్తరాన విస్తరిస్తున్న ప్రాంతానికి ఆర్ఐగా వ్యవహరిస్తున్న వ్యక్తిని పన్నులో పేరు మార్చాలని కోరగా, ఎలా అంటే అలా మార్చరని, తనను కలిస్తేనే మార్పు తారంటూ తెగేసి చెప్పడం గమనార్హం.



● వసూళ్లకు సాకుగా సర్వే

నగరంలోని భవనాలు తాజా పరిస్థితులకు అనుగుణంగా పన్ను ఉందా.. లేదా..? అని పరిశీలించేందుకు రెవెన్యూ విభాగం సర్వే నిర్వహిస్తున్నది. ఈ సర్వేను కొత్తగా వచ్చిన ఆర్ఐలు తమ వసూళ్ల దందాకు సాకుగా మలుచుకుంటున్నారు. నగరంలోని ఖరీదైన ప్రాంతాలను ఎంచుకుని మీ ఇంటికి పన్ను తక్కువగా వస్తున్నది... పెంచాలి...అని చెప్తూ అలా చేయకుండా ఉండాలంటే తమకు డబ్బులు ఇవ్వాలని బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు. కృష్ణ పట్నం పోర్టు కు వెళ్లే దారిలో ఓ విద్యా సంస్థకు ఈ తరహా డిమాండ్ నోటీసు ఇచ్చిన ఆర్ఐ తనకు డబ్బులిస్తే అంతా సాఫీగా జరిగిపోతుందని చెప్పాడు. ఇదే తరహా లోనే కోడూరు పాడుకు వెళ్లే రహదారి వెంబడి ఉన్న ప్రాం తంలోనూ స్థానిక ఆర్ఐ వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి.

● వసూళ్ల కోసం ఏజెంట్లు

కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగం ఆర్ఐలు మితిమీరిన అవినీతికి పాల్పడుతున్నారని గ్రహించిన అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) వారిని ఎలాగైనా పట్టుకోవాలని వల విసిరేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పలు ఫిర్యాదులు ఆ శాఖ వద్ద ఉన్నాయి. ఈ విషయాన్ని గ్రహించిన కొత్త ఆర్ఐలు నగదు వసూళ్లకు ఏజెంట్లను నియమించుకున్నారు. భవనాల పరిశీలన, పన్ను హెచ్చుతగ్గుల ఆరా, పేర్లు మార్పిడి వ్యవహారమంతా వారికే అప్పగించారు. అవినీతి రూపేణా తీసుకుంటున్న ప్రతి రూపాయిని కూడా ఏజెంట్ల ద్వారానే పొందుతున్నారు. మొత్తంమీద ఎన్ఎంసీ రెవెన్యూ విభాగంలో కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయం కన్నా, ఆర్ఐలకు వ్యక్తిగతంగా వచ్చే ఆదాయమే ఎక్కువగా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

న్యూస్ బాక్స్

సోమశిలలో 66.870 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 1,833 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 66.870 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రేపు వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఈనెల 4వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్‌యూ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్తంగా ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాకు బహుళ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించనున్నారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ చదివిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాచలం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించే 'కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ - డొమెస్టిక్ నాన్ - వాయిస్' శిక్షణ కోర్సుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు యూనివర్సిటీ నైపుణ్యాభివృద్ధి సమన్వయకర్త డాక్టర్ జె.విజేత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోర్సుల కోసం ఈనెల 7వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత చెంది 18 నుంచి 25 ఏళ్ల లోపు వారు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ అందజేస్తామని, ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాల కార్యాలయంలో స్వయంగా సమర్పించాలని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి

గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

వింజమూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ శాస్త్రీయ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణం లోని వైఆర్ జూనియర్ కళాశాల ఆవర ణలో ఆదివారం ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మెగా టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు పాల్గొని విజేతలకు బహు మతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, డాక్టర్ మాసిలామణి, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, వింజమూరు మండల ఆపస్ నాయకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



నీటితో కళకళలాడుతున్న కండలేరు జలాశయం

- రికార్డు స్థాయిలో నీటి నిల్వ
- టూరిస్టు స్పాట్‌గా గుర్తింపునకు ప్రతిపాదనలు
- సీ ప్లైన్‌కు కూడా అవకాశం

కండలేరుకు జలకళ

రాపూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం జలకళను సంతరించుకుంది. డ్యాం పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 54.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ నేపధ్యం లో త్వరలోనే జలాశయాన్ని టూరిస్టు కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. అంతేకాక జలాశయంలో సీప్లైన్‌కు కూడా అవకాశం ఉంది.

కాగా 1983లో ఎన్టీఆర్ రాజకీయ రంగప్రవేశం తర్వాత అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీతో సంప్రదించి, తెలుగుగంగ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా రాపూరు మండలం కండలేరు నదిపై జలాశయాన్ని నిర్మించారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో తాగు, సాగునీటితోపాటు చెన్నైకి తాగునీటి అవసరార్థం కండలేరును నిర్మించారు. చెన్నైకి 15టీఎంసీ నీరు ఇవ్వాలనేది అంతర్ రాష్ట్రాల ఒప్పందం. 1983లో ఏపీ సీఎం ఎన్టీ రామారావు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజీఆర్, ప్రధాని ఇందిరాగాంధీ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 1996 సెప్టెంబరు 23న తెలుగుగంగ నీళ్లు మొదటిసారి చెన్నైకి వెళ్లాయి. కండలేరు నుంచి నీరు 152 కి.మీ ప్రయాణించి తమిళనాడులోని పూండి జలాశయానికి చేరుతాయి.

● అతి పొడవైన మట్టి కట్ట

కండలేరు రిజర్వాయర్‌ను 10.75 కి.మీ పొడవు, 49మీటర్ల ఎత్తున నిర్మించారు. దీన్ని 1983లో ప్రారంభించినా 1996లో పూర్తయింది. ఆసియాలోనే అతి పొడవైన మట్టికట్టగా గుర్తింపు పొందింది. ఇటీవల కురిసిన వర్షాలకు భారీ స్థాయిలో నీటి నిల్వ చేరింది. సుమారు 58 టీఎంసీల వరకు నీటి నిల్వ ఉంది. ఈ జలాశయం తిరుపతి నుంచి 107 కి.మీ, నెల్లూరు నుంచి 54 కి.మీ దూరంలో ఉంది.

● ఆహ్లాదకర వాతావరణం

కండలేరు చుట్టూ పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం ఉంది. దీంతో దీన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. జలాశయాన్ని టూరిజం, ఇరిగేషన్‌శాఖలు కలిసి అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది. అలాగే పెంచలకోన ఆలయానికి, తిరుపతికి దగ్గరగా ఉండడంతో భక్తులకు ఇక్కడ కూలా సేద తీరడానికి అనువుగా ఉంది. ఇటీవల ఇక్కడి అధికారులు కూడా సీ ప్లైన్స్ ప్లయిన్ లాండింగ్ అవకాశం ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కండలేరును టూరిస్ట్ స్పాట్‌గా ప్రకటిస్తే ఇక్కడి స్థానికులకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి.

● మత్స్యకారులకు జీవనోపాధి

కండలేరుకు అనుసంధానంగా ఉండే అనేక గ్రామాల్లోని మత్స్యకారులు ఈ జలాశయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. రాపూరు మండలం గుండోవోలు, వెలుగోను పెనుబర్తి, ఓబులాయపల్లి, రేగడపల్లి, నెల్లెపల్లి, చానాయ పాలెంతోపాటు సుమారు 20 గ్రామాల్లో మత్స్య కారులు కండలేరులో చేపలు వేటాడి జీవిస్తున్నారు. ఈ డ్యాంలో లభించే చేపలు, రొయ్యల ద్వారా తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరు చుకుంటున్నారు.

ఎన్‌డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజీనామా

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ (ఎన్‌డీసీఎంఎస్) బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖ ను జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు అందజేశారు. అనారోగ్యం, వ్యక్తిగత కారణా లతో రాజీనామా చేస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. వెంకటస్వామి 2019లో బిజినెస్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో ఎన్‌డీసీఎంఎస్ నష్టాలు ఊబిలో ఉండేది. ఇఫ్కో ఎరువులు అమ్మగా వచ్చిన డబ్బుతో ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి. అలాంటి సంస్థను వెంకట స్వామి ప్రగతిబాట పట్టించారు. 2020 - 2021, 2021 - 2022 సంవత్స రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించడం ద్వారా ఆదా యాన్ని సమకూర్చారు. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో జిల్లాలో నియోజక వర్గానికి రూ.లక్ష వంతున ఎన్‌డీసీఎంఎస్ తరఫున అందజేసి అవసరా ర్థులకు ఫలసరుకులు అందేలా చూశారు. లాక్‌డౌన్ కాలంలో సేవలకు గాను 2022 జనవరి 26న ఉత్తమ బిజినెస్ మేనేజర్ అవార్డును అందు కున్నారు. 2022-23, 2023-24 మధ్య కాలంలో వరి ధాన్యం కొనుగోలు తగ్గడంతో అప్పట్లోనే పదవికి వెంకటస్వామి రాజీనామా చేశారు. అయితే నాటి పాలక మండలి ఆయన రాజీనామాను తిరస్కరించి పదవిలో కొనసా గాలని సూచించింది. గతేడాది ఎండీసీఎంఎస్ ఆర్థికా భివృద్ధి కోసం జనరిక్ మెడికల్ దుకాణాన్ని వెంకటస్వామి ఏర్పాటు చేయించారు. ఇలా.. సంస్థ గాడిన పడుతుండటం, ప్రస్తుతం ధాన్యం కొనుగోలు సీజన్ ప్రారంభమైన సందర్భంలో వెంకటస్వామి రాజీనామా చేయడం ఆ సంస్థకు నష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు

- రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ చందర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024లో 822 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 440 మంది మృతి చెందారు. 890 మంది క్షతగాత్రులయ్యారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ క్రమంలో జనవరి 16 నుంచి ప్రారంభమైన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ రోజుకో కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నది. ఆ కార్యక్రమాల వివరాలను రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ బీ చందర్ ఆంధ్రజ్యోతికి వివరించారు.

● ప్రజలకు అవగాహన

రోడ్డు ప్రమాదాల నివారణకు జనవరి 16 నుంచి ఈ నెల 15 వరకు కార్యక్రమాలను చేపడుతున్నాం. ఇప్పటి వరకు ప్రజా చైతన్య ర్యాలీలు, హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీలు, స్కూల్ బస్సు, ఆటో, లారీ, బస్సు డ్రైవర్లకు డ్రైవింగ్‌పై సదస్సులు నిర్వహిస్తున్నాం. అందరినీ కలుపుకొని రహదారి భద్రత, రోడ్డు నియమాలపై అవగాహన కల్పిస్తున్నాం.

● బ్లాక్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని ఆర్‌అండ్‌బీ, మూడు జాతీయ రహదారులపై బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చర్చించాం. అనంతరం ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరగ కుండా చేపట్టాల్సిన చర్యలకు వెంటనే ఆదేశాలు ఇచ్చాం. బ్లాక్ స్పాట్లలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సెంట్రల్ లైట్లు, రేడియం స్టిక్కర్లు, మలుపులు, గుంతలు పూడ్చడం, డైవర్షన్... ఇలా అనేక చర్యలు చేపట్టాం.

● ప్రాణం ఎంతో విలువైంది

మనపై తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు ఆధారపడి ఉంటారని వాహనదారులు గుర్తించు కోవాలి. నాణ్యమైన హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలు నడపడం, ద్విచక్ర వాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయా ణించడం, ప్రయాణించే ఇద్దరు హెల్మెట్‌లు ధరించడం, కారులో సీటు బెల్ట్ తప్పని సరిగా ధరించడం చేయాలి. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, డ్రంకన్‌డ్రైవ్, కెపాసిటీకు మించి వాహనాల్లో ప్రజలను ఎక్కించడం చేయరాదు. ప్రజలంతా రహదారి భద్రత మన బాధ్యత అనుకొని రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండదని ఆయన వివరించారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన ట్రెజరీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



ట్రెజరీ ఉద్యోగుల సంఘం

జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యవర్గానికి ఎన్నికలు ఆదివారం జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా పీ కిరణ్ కుమార్, సహాధ్యక్షుడిగా సయ్యద్ వహీదుద్దీన్ రహమాన్, ఉపాధ్యక్షులుగా కొండూరు మమత, షేక్ ఖాదర్‌వలి, ఆర్ కొండలరావు, ఐ ముని సుమంత్, కార్యదర్శిగా కాకి నరేంద్రబాబు, సంయుక్త కార్యదర్శులుగా టి విజయకుమారి, వీ ముకుందవల్లి, ఆర్ భాస్కర్‌రావు, ట్రెజరర్‌గా టీ సౌభాగ్యవతి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లుగా కే దొరబాబు, ఈగ శ్యాంప్రసాద్, పీ జవహర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచలరావు, సహాయ ఎన్నికల అధికారులుగా బీ సతీష్, ఎస్ అంజనేయులు వ్యవహరించారు.

ఏపీటీఎస్‌ఏ ఎన్నిక చెల్లదు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీస్ బైలా ప్రకారం ఆదివారం ట్రెజరీ కార్యాలయంలో జరిగిన ఏపీటీఎస్‌ఏ ఎన్నిక చెల్లదని ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్‌కి చెందిన వీ రాజేష్‌బాబు, పీవీ కిషోర్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ అసోసియేషన్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా జీ రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా డీ రమణారెడ్డి ఎన్నికయ్యారని తెలిపారు. అయితే రమణారెడ్డి వేరే వర్గంలో చేరి నెల్లూరు జిల్లా ట్రెజరీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు జరిపించారని ఆరోపించారు. ఎన్నికలు జరపాలంటే సర్వసభ్య సమావేశం నిర్వహించాలని, పత్రికా ప్రకటన విడుదల చేయాలన్నారు. ఇవేమీ చేయకుండా రాష్ట్ర అధ్యక్షుడు ప్రొసీడింగ్ ఆర్డర్ జారీ చేయకుండా ఎలా ఎన్నికలు జరుపుతారని ప్రశ్నించారు. దీన్ని తాము ఖండిస్తున్నామని తెలిపారు.

కొనసాగుతున్న పుస్తక ప్రదర్శన



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో జరుగుతున్న సింహపురి పుస్తక మహోత్సవం ఆది వారం ఆరో రోజుకి చేరుకుంది. రాత్రి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'విద్య - పర్యావరణం', 'శరీర నిర్మాణం - ఆరోగ్యం' అంశాలపై అవగాహన సదస్సులు జరిగాయి. మానవ శరీర నిర్మాణం, శరీరాన్ని వ్యాధులకు గురిచేసే సూక్ష్మజీవుల ప్రభావాలపై ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల సహాయ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా వివరించారు. రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల డాక్టర్ శ్రీనునాయక్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జేవీవీ నాయకుడు ఎంవీ చలపతి విద్య ఆవశ్యకత, పర్యావరణ కాలుష్యం పై ఉపన్యసించారు. విశ్రాంత ఉపాధ్యాయిని పీ విజయమ్మ పప్పెట్రీ ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారి ధ్రువకుమార్ రాజు ఆలపించిన పద్యాలు, పాటలు, జేవీవీ కళాబృందాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి పీ గోపినాథ్, జేవీవీ నాయకుడు హరిబాబు పాల్గొన్నారు. కే లక్ష్మయ్య సమన్వయకర్తగా వ్యవహరించారు.

భవనం పైనుంచి పడి యువకుడి మృతి

ముత్తుకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన కృష్ణపట్నం పోర్టులోని అదానీ వరల్డ్ స్కూల్‌లో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... ఏసీ పనుల నిమిత్తం వచ్చిన సంజిత్ (22) ఆదివారం తెల్లవారుజామున స్కూల్ భవనం నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కృష్ణపట్నం సీఐ రవినాయక్, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు సంజిత్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వాడని, పోర్టులో కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రవినాయక్, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి

భగవంతుడి సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు

- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి



సందేశమిస్తున్న చినజీయర్‌స్వామి

ఉదయగిరి రూరల్ (దుత్తలూరు), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భగవంతుని సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నర్రవాడ గ్రామంలో జరుగుతున్న జనార్ధనస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేప ట్టారు. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి, గ్రామపెద్దలు, అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు ప్రవచనాలు అందచేశారు. భగవంతుని సంకల్పం ఉంటే అనుకున్నవి జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాదాల బాబురావు, మాదాల తిమ్మయ్యచౌదరి, గోగినేని రామచంద్ర, మల్లంపాటి గురవయ్యానాయుడు, ఆలయ ఈవో ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖుల రాక

ఆలయ జీర్ణోద్ధరణ ఉత్సవాల్లో చివరి రోజైన సోమవారం నిర్వహించే ప్రత్యేక పూజలు, స్వామివారి కల్యాణోత్సవానికి మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

2047సరే 2025 మాటేమిటి?

- సూపర్‌సిక్స్ అమలు చేయరా?
- ఉద్యమాలకు సీపీఎం శ్రీకారం
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు, ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2047 స్వర్ణాంధ్ర ప్రదేశ్ గురించి చెబుతున్నారు అయితే ప్రస్తుత 2025 మాటేమిటని సీపీఎం నేతలు ప్రశ్నిస్తున్నారు. నెల్లూరులో జరుగుతున్న సీపీఎం 27 రాష్ట్ర మహాసభల్లో భాగంగా ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు మాట్లాడుతూ ఎన్నికలలో చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆస్తివిలువ ఆధారంగా పన్నులు ఉంటాయని చెబుతూ ఆస్తుల రిజిస్ట్రేషన్ చార్జీలు విపరీతంగా పెంచేశారని విమర్శించారు. బీజేపీ, టీడీపీ, జనసేనతో రాష్ట్రంలో ట్రిబుల్ ఇంజన్ పాలన వచ్చిందని చెబుతున్నా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ, వెనుకబడిన ప్రాంతాల అభి వృద్ధి లేదని ఆరోపించారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయమని ప్రధాని మోదీతో చెప్పించాలని డిమాం డ్ చేశారు. బీహారు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో ఆ రాష్ట్రానికి నిధులు భారీగా కేటాయించారన్నారు. మన రాష్ట్రానికి మాత్రం మొండిచేయి చూపించారని కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ప్రచారానికి వెళుతున్న టీడీపీ, జనసేక నేతలు రాష్ట్రానికి నిధులు రాబట్టుకోవటంలో వైఫల్యం చెందారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ప్రజా పోరాటాలు నిర్వహిస్తుందని వెల్లడించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బుందేల్‌ఖండ్ తరహాలో రాష్ట్రానికి ప్రత్యేక నిధులు ఇస్తుందని ఆశించామని అయితే నిరాశే మిగిలిందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాల మీదే దృష్టిపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన జిల్లాలను అభివృద్ధి చేయదా.. అని ప్రశ్నించారు. అనంతరం పలు తీర్మానాలతో కూడిన పత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే నగర బహిష్కరణ

రౌడీషీటర్లకు నగర డీఎస్పీ సింధుప్రియ హెచ్చరిక

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో నగర బహిష్కరణ, పీడీ యాక్ట్ విధిస్తామని నెల్లూరు నగర డీఎస్పీ సింధుప్రియ రౌడీషీటర్లకు వార్నింగ్ ఇచ్చారు. నెల్లూరులోని నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. నగరంలోని ఆరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు అందరిపై నిఘా ఉండాలన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అనుచిత చర్యలకు పాల్పడకుండా సమాజంలో మంచి వ్యక్తులుగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, స్టేషన్‌లోని రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బందికి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ తనిఖీల్లో ట్రైనీ డీఎస్పీ శివప్రియ పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	113
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7977
వెండి కిలో ధర	రూ. 96,300
వెండి ఒక గ్రాము	రూ.99.30

20 వానరాల మృత్యువాత



మృతిచెందిన వానరాలు

ఉదయగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారి పక్కనే ఉన్న జామాయిల్ తోటలో 20 వానరాలు మృతిచెందిన విషయం ఆదివారం వెలుగుచూసింది. ఎవరో వానరాలపై విషప్రయోగం చేసి అవి మృతిచెందడంతో అటవీ ప్రాంతంలో పడేసినట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసు, అటవీ శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వానరాలను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

ఆత్మకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ముళ్ల పొదల్లో పట్టణానికి చెందిన షేక్ బషీర్ (65) అనే వృద్ధుడు అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడాన్ని శనివారం రాత్రి స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటీలోని ఎల్‌ఆర్‌పల్లికి చెందిన షేక్ బషీర్ గత కొంతకాలం నుంచి హైదరాబాదులో ఉంటున్నాడు. ఇతనికి ఆత్మకూరులో పింఛన్ వస్తుంది. ప్రతి నెలా 1వ తేదీన వచ్చి పింఛన్ తీసుకుని వెళ్తుంటాడు. ఈక్రమంలో శనివారం హైదరాబాదు నుంచి ఆత్మకూరుకు వచ్చి పింఛన్ రూ. 4వేలు తీసుకున్నాడు. అనంతరం సమీప బంధువుతో కలిసి పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లి ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. బంధువు మద్యం ఎక్కువగా తాగడంతో మైకంలో తెలియక బషీర్‌ను వదిలేసి ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. ఈక్రమంలో పూటుగా మద్యం సేవించిన బషీర్ దిక్కుతెలియక రెస్టారెంట్‌కు ఎదురుగా ఉన్న ముళ్ల పొదల్లో పడిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. గుర్తించిన స్థానికులు శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఆత్మకూరు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ముళ్ల పొదల్లో పడి ఉన్న షేక్ బషీర్ మృతదేహం

సామాన్యుడికి ఉపయోగపడని కేంద్ర బడ్జెటు

బిట్రగుంట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెటు సామాన్యుడికి ఉపయోగపడేది కాదని కాంగ్రె రాష్ట్ర టీసీసీ సభ్యులు ఎల్.సురేష్‌బాబు అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని ఆయన స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు అవసరాలను విస్మరించి ధనికులకే కార్పొరేట్ వేసినట్లుందన్నారు. ప్రతి ఒక్కరికి అవసరమైన డీజిల్, పెట్రోల్‌తోపాటు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి ఉంటే బాగుండేదన్నారు. అంకెల గారడీతో కేంద్రం ప్రజలను మభ్యపెట్టేలా బడ్జెట్టుగా ఉందన్నారు.

రూ. 3.2 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ. 3.2 కోట్లతో నిర్మించనున్న నూతన తారురోడ్ల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రూ.1.2కోట్లతో మండల కేంద్ర ంలోని ఓవీ రోడ్డులోని మాల్యాద్రికాలనీ (పెద్దఓగూరు జంక్షన్) నుంచి మహ దేవపురం వరకు తారురోడ్డు, రూ.2కోట్లతో పలుకూరు అడ్డరోడ్డు నుంచి పలుకూరు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం చేపడతా మన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో ఈ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల కనెక్టివిటీ రోడ్లను తారురోడ్లుగా మారుస్తామన్నారు. అలాగే ప్రతిగ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించటమే కూటమిప్రభుత్వం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య, దామా మల్లేశ్వరరావు, చల్లా నాగేశ్వరరావు, బొడ్డులూరి కొండలరావు, చిట్టా హరికృష్ణ, అల్లం వెంకటేశ్వర్లు, రాయపాటి శ్రీనివాసరావు, చెంబేటి వీరాంజనేయులు, చెంబేటి హరిబాబు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నం మాలకొండయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



పొంగళ్ల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో రజకులు చేపట్టిన పొంగళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. మహిళలతో కొంత సేపు ముచ్చటించారు. అనంతరం టీడీపీ నేత గాదంశెట్టి వేణుగోపాల్ స్థానిక ముసునూరు ఆటోనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ షోరూమ్‌ను ప్రారంభించారు. అలాగే పట్టణంలో పలు వివాహ, నలుగు కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొని వారిని ఆశీర్వదించారు. అనారోగ్యంతో ఉన్న స్థానిక టీడీపీ నేత అనుమలశెట్టి శివను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిపై వైసీపీ రియల్టర్ల మండిపాటు

కావలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్లలో తెలిసో తెలియక కొన్ని పొరపాట్లు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు జరిగిఉంటాయని వాటిని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లి చట్టపరంగా సరిచేసు కుంటామని కావలి రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెలిపారు. ఈ విష యంపై ఆదివారం వారు స్థానిక కల్యాణ మండపంలో రియల్‌ఎస్టేట్ మీడియేటర్లతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సమావేశం నిర్వహించారు. వైసీపీ కీలక నాయకులుగా చలామణి అయిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, జనిగర్ల మహేంద్రయాదవ్, ఈతముక్కల బాలమురళీ రెడ్డి, కాటా శ్రీనివాసులు రెడ్డి, జయరామిరెడ్డి, బాబు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తీరుపై విరుచుకుపడ్డారు. లేఅవుట్లలో బెదిరించి వాటాలు తీసుకుని, గ్రావెల్‌కు ట్రిప్పరుకు రూ.2వేలు అదనంగా తీసుకుని అందరికన్నా ఎక్కువగా లబ్ధిపొందిన ఆయన ఇప్పుడు మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. గతంలో ఎందరో ఎమ్మెల్యేలుగా పనిచేశారని ప్రతాప్‌రెడ్డి లాంటి అవినీతి పరుడిని చూడలేదన్నారు. తాము సమావేశం పెట్టుకుంటామని తెలిసి తమను బెదిరించాడన్నారు. ని ఆయన ఇప్పటికీ అధికారంలో ఉన్నట్లు భావిస్తున్నాడని ఆయన బెదిరింపులకు భయపడేదిలేదన్నారు. ఇప్పటి వరకు ఆయన చేసిన తప్పులలో భాగస్వాములై శిక్షలు అనుభవిస్తున్నామని చెప్పారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

● డీఎస్‌డబ్ల్యూవో శోభారాణి



ప్రసంగిస్తున్న డీఎస్‌డీవో శోభారాణి

ఆత్మకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని డీఎస్‌డబ్ల్యూవో కె శోభారాణి పేర్కొన్నారు. స్థానిక ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలోని ఎస్సీ వసతిగృహాల్లో చదువుతున్న ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయం వృథా చేసుకోకుండా ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా జవాబులు రాసేందుకు ప్రయత్నించాలన్నారు. అనంతరం తెలుగు, ఇంగ్లీషు, గణితం, హిందీ, సైన్సు సబ్జెక్టులలో నిపుణులైన ఉపాధ్యాయులు, ట్యూటర్ల చేత పరీక్షలు రాసే విధానంలో అనుసరించాల్సిన మెళకువల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, ఉదయగిరి ఏఎస్‌డబ్ల్యువోలు బ్రహ్మానందాచారి, ఆదిలక్ష్మీ, పలు మండలాల పరిధిలో ఉన్న ఎస్సీ వసతిగృహాల సంక్షేమాధికారులు, రిసోర్స్‌పర్సన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

లింగసముద్రం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పెంట్రాల పంచాయతీ శాగంవారిపాలెం అడ్డరోడ్డులోని శాయిపేట వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో తండ్రి, కొడుకులు కావలికి చెందిన ఎఫ్రాయిమ్, జాయ్‌లు గాయపడ్డారు. బాపట్లకు చెందిన ఎఫ్రాయిమ్ ఆయన భార్య కృప పాస్టర్లుగా ఉంటూ కావలిలో నివాసం ఉంటున్నారు. ఈయన లింగసముద్రం మండలం వెంగళాపురంలో చర్చికి మోటారు సైకిల్‌పై భార్య, కుమారుడితో వెళుతుండగా గొర్రుతో ఉన్న ట్రాక్టర్ వేగంగా వచ్చి మోటారు సైకిల్‌ను ఢీకొంది. ప్రమాదంలో జాయ్(13ఏళ్లు) కాలు విరిగింది. స్థానికులు 108కి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి క్షతగాత్రులను కావలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే జాయ్‌ను మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



టీచర్ స్వర్ణలతను సత్కరిస్తున్న ఐఎంఏ బాధ్యులు

కావలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కావలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి వైజ్ఞానిక ప్రాంగణంలో పట్టణంలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. అనంతరం ఐఎంఏ గౌరవసలహాదారుడు బెజవాడ రవికుమార్, గణితశాస్త్ర ఉపాధ్యాయులు మహేష్‌లు ఉపాధ్యాయురాలు స్వర్ణలతను సత్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కామంచి సుబ్బారావు, గోపిక్రిష్ణ, కోశాధికారి పామూరు శివప్రసాద్, సైన్స్‌క్విజ్ ఆర్గనైజర్లు డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, గంగాధర్‌రెడ్డి, శ్రీచైతన్యకళాశాల ప్రిన్స్‌పాల్ టీ.లుకోధర్, కరస్పాండెంట్లు వెంకయ్య, మధుసూధన్, తోట వెంకటేశ్వర్లు, జానకిరాం, హరినాథ్ పాల్గొన్నారు.

సౌత్ సెంట్రల్ రైల్వేజోన్ మెంబరుగా వేణుయాదవ్

జలదంకి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేశవరం గడ్డె వేణుమాధవ్‌యాదవ్ సౌత్‌సెంట్రల్ రైల్వేజోన్ సభ్యుడిగా నియామకం అయ్యాడు. బీసీ ఉద్యమ నాయకుడు ఆర్.క్రిష్ణయ్య సహకారంతో ఈ పదవి వరించిందని ఆదివారం తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన ఆర్.క్రిష్ణయ్య, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వేలో ప్రయాణికుల సౌకర్యాలకు తన వంతు కృషిచేస్తానన్నారు.

రంగా విగ్రహం ఏర్పాటుకు బీసీ విరాళం



నిర్మాణంలో ఉన్న రంగా విగ్రహం వద్ద బీస్ సభ్యులు

కావలిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు బలిజ ఎంప్లాయీస్ అభ్యుదయ సేవాసమితి సభ్యులు రూ.20వేలు విరాళం అందజేశారు. మాగుంట పార్వతమ్మ రోడ్డు రైతుబజార్ వద్ద నిర్మాణంలోనున్న రంగా విగ్రహం వద్ద బీస్ ప్రెసిడెంట్ నాగిశెట్టి శ్రీనివాసులు, సెక్రరీ చలపతిరావు, సభ్యులు విగ్రహ కమిటీ బాధ్యులు శ్రీనివాసులు, శ్రీనివాసులుకు నగదు అందజేశారు. విడతలవారీగా విగ్రహ నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీస్ గౌరవాధ్యక్షులు పాపిశెట్టి జానకిరామ్, సభ్యులు పాశం శ్రీనివాసులు, సుధాకర్, అమిరిశెట్టి హజరత్తయ్య, వెంకటసతీష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

చిన్నపాటి నిర్లక్ష్యం.. తీవ్ర నష్టం

● బ్యారన్‌లలో అగ్నిప్రమాదాలు
● నష్టపోతున్న పొగాకు రైతులు



మర్రిపాడు మండలంలో అగ్ని ప్రమాదానికి గురైన బ్యారన్ (ఫైల్)

మర్రిపాడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి నిర్లక్ష్యంతో పొగాకు రైతుల కష్టం బూడిదపాలు అవుతోంది. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని రైతులు ఎక్కువ మంది వాణిజ్య పంట పొగాకును సాగుచేస్తుంటారు. గత మూడేళ్లుగా ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఏటా సాగుదారులతోపాటు పంట విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. గత ఏడాది బోర్డు పరిధిలో 34 బ్యారన్లలో అగ్ని ప్రమాదాలు సంభవించి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

నిర్లక్ష్యమే కారణం

పొగాకును క్యూరింగ్ చేసే డ్రైవర్ పర్యవేక్షణ సరిగా లేకపోవడం అగ్ని ప్రమాదాలకు కారణం అవుతోంది. అల్లిన కర్ర, లేదా పైనుంచి ఆకులు రాలి మొద్దు గొట్టంపై పడటం వల్లే బ్యారన్లలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాల్పు సమయంలో నిరంతర పరిశీలనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలమని బోర్డు అధికారులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మొద్దుగొట్టంపై తప్పనిసరిగా జల్లెడ (నెట్) ఏర్పాటుచేసుకోవాలి. దీని వల్ల ప్రమాదవశాత్తు కర్ర పైనుంచి పడినా నష్టం ఉండదు. క్యూరింగ్ ప్రారంభానికి ముందే పొయ్యిగొట్టం మొద్దులు అన్నీ సరిగా ఉన్నాయా, లేవో చూసుకోవాలి. ఆకు అల్లికకు సన్నని కర్రలు వాడరాదు. బ్యారన్ లోపల అడ్డంగా ఉండే గుంజలు (టైర్లు) బలంగా ఉండాలి. ఒక విడతకు 1100 కర్రలను మాత్రమే క్యూరింగ్ కోసం ఉంచాలి. లోపల ఉష్ణోగ్రత తెలిపే పరికరం సక్రమంగా పనిచేస్తుందో, లేదో సరిచూడాలి. అందుబాటులో నీళ్ళు ఉంచుకోవాలి. బ్యారన్లకు కచ్చితంగా బీమా చేసుకోవాలి. దీనివల్ల ప్రమాదం జరిగినా పరిహారం రూపంలో పొగాకు రైతులకు సాయం అందుతుంది.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అనంతసాగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కంబంపాడులో ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్‌ఆర్ ఆసుపత్రి నెల్లూరు వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నరాల స్పెషలిస్ట్ దువ్వూరు దయాకర్‌రెడ్డి, బి సుధాకర్, నిర్వాహకులు రొండా వెంకటరమణారెడ్డి, చింతగుంట నరసింహారెడ్డి, మస్తాన్‌వలి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మహంత్‌రెడ్డి ఎన్నిక

ఆత్మకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూరుకు చెందిన మహంత్‌రెడ్డి ఎంపికయ్యాడు. విశాఖపట్నంలో జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో జరిగిన ఆంధ్రవిద్యార్థి సంఘం రాష్ట్ర మహాసభల్లో జిల్లా అధ్యక్షుడిగా మహంత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహంత్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డికి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

స్వామి వివేకానందకు నివాళి

వింజమూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ నలుమూలల వ్యాపింపచేసిన వ్యక్తి స్వామి వివేకానంద అని రిటైర్డ్ ఉపాధ్యాయుడు శేషగిరిరావు అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వింజమూరు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కందల మధు, పి వెంగయ్య, డేగ మధుయాదవ్, పి వెంగళరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ కూల్చివేత



కూల్చివేసిన వాటర్ ట్యాంక్

సీతారామపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం గ్రామ పంచాయతీలోని రాజుగారి కాలనీలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును ఆదివారం ఎంపిటిసి పాలగిరి అల్లూరురాజు ఆధ్వర్యంలో కూల్చివేశారు. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి ఆదేశాలతో పంచాయతీ తీర్మానంతో మండల ఎంపీపీ నిధులతో కూల్చివేయించారు.

ప్రమాద బాధితులను రక్షిస్తే నగదు ప్రోత్సాహకాలు



అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారులు.

కావలి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని రక్షించిన వారికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందిస్తుందని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ సుందర్‌రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల, ప్రవీణ్, ఆనంద్ వైద్యశాలల్లో ఆదివారం నిర్వహించిన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్నారు. చట్టంపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లు అతికించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ సుందర్‌రావు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాదును విజయవంతం చేయాలి : ఎమ్మార్పీఎస్



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉదయగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకై హైదరాబాదులోని ఎ ల్‌బీ స్టేడియంలో నిర్వహించే లక్షల డప్పులు - వేల గొంతు లు కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని ఎమ్మార్పీ ఎస్ నాయకులు బకీరు జాషు వా, బెజవాడ బాలగురవయ్య కోరా రు. ఆదివారం స్థానిక షాదీ మంజిల్‌లో కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేసి పాలకులు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. చలో హైదరాబాదు కార్యక్రమానికి నియోజవర్గంలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, మాదిగలు, మాదిగ ఉపకులాలు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజా, పెంచలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఉదయగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయ ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి, దత్తాత్రేయస్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈసందర్భంగా వేదపండితులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయానికి వాటర్ ప్లాంటు వితరణ



వాటర్ ప్లాంటు ప్రారంభిస్తున్న దాతలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రామాపురం గ్రామానికి చెందిన పోకా కుటుంబీకులు నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటుకు ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులకు తమవంతు దాతృత్వంగా ప్లాంటును అప్పగించారు. ఈసందర్భంగా దాతలు పోకా మహేశ్వరరావు, మోహన్‌రావు మాట్లాడుతూ తన సోదరుడు మాల్యాద్రి జ్ఞాపకార్థం నిర్మించిన ప్లాంటును భక్తుల సౌకర్యార్థం ఆలయానికి అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం

ఉదయగిరి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంపై టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అయితే నెల్లూరు జిల్లాను కర్నూల్‌లో కలపకుండా, అమరావతి హైకోర్టులోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు జిల్లా వాసులకు అమరావతి అయితేనే అనుకూలంగా ఉంటుందని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

తరగతి గదులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి : జేవీవీ



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్‌రెడ్డి

ఉదయగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీ మంజిల్‌లో ఆదివారం సీతా రామపురం, ఉదయగిరి, దుత్త లూరు, వరికుంటపాడు మండలాలకు చెందిన ఉపాధ్యాయు లకు తరగతి గదిని ఆకర్ష ణీయంగా రూపొందించడం ఎలా అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక జాతీయ, రాష్ట్ర నాయకులు బ్రహ్మారెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డిలు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తరగతి గదులను విద్యార్థులను ఆకర్షించేలా తీర్చిదిద్ది, సులభంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలన్నారు. సైన్స్ అంశాలకు సంబంధించి పలు విషయాలను దృశ్య రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు షేక్ దస్తగిరిఅహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, గోపాల్‌నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఆర్‌ఆర్‌బీ, ఆర్‌ఆర్‌సీలో ఉద్యోగం

బిట్రగుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యువతీయువకులు కష్టపడి చదివితే ఆర్‌ఆర్‌బీ, ఆర్‌ఆర్‌సీలతో రైల్వే ఉద్యోగాలు సంపాదించవచ్చని బిట్రగుంట స్టేషన్ మాస్టర్ మోహన్ తెలిపారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.స్వర్ణన్‌రాజ్ ఆధ్వర్యంలో సభ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదో తరగతి పాస్ అయిన 18-36 ఏళ్ల మధ్య వయసున్న యువత రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరికి లంచాలు, రెకమండేషన్‌లతో పని లేకుండా ప్రతిభ ఆధారంగా రైల్వే ఉద్యోగం సాధించ వచ్చన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులుయాదవ్, వ్యవస్థాపక అధ్యక్షులు కుందుర్తి శ్రీనివాసులు, రైల్వే లోకోపైలెట్ జీవన్‌కుమార్, రిటైర్డ్ ఓ.ఎస్ గోవిందరాజులు, అసోసియేషన్, వాకర్స్ సభ్యులు ఉన్నారు.

హమ్మయ్య .. ఆకలి బాధ తప్పింది !

● సెలవు రోజుల్లోనూ పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



ఉదయగిరి ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు డిసెంబరు 1 నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేసి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల పని దినాల్లో మధ్యాహ్న భోజనం అందుతుండగా రెండో శనివారం, ఆదివారాల్లో సెలవు దినాలు కావడంతో కొందరు విద్యార్థులు ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చుకొంటుండగా, మరికొందరు పస్తులుంటున్నారు. దూరప్రాంతాల నుంచి ప్రత్యేక తరగతులకు హాజరు కావాల్సి ఉండటంతో పలువురు విద్యార్థులకు భారంగా మారింది. చాలామంది పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగానే కొంతమంది పాఠశాలకు రావడం లేదు. ఈ విషయం కూటమి ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో పది విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం పెట్టాలని నిర్ణయించింది. దీంతో ఆదివారం నుంచి మార్చి 10వ తేదీ వరకు ఈ సదుపాయం కల్పించడంతో జిల్లాలోని 341 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల ఆకలి బాధ తీరినట్లయ్యింది. ఈవిషయమై ఎంఈవో షేక్ మస్తాన్‌వలిని వివరణ కోరగా ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అమలు చేస్తున్నామని తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

● మీసాల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో



ఈ ముఖాముఖి

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరుతోపాటు మండలంలో 17 పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు.

? ఎన్ని రోజులకు వాటర్‌ట్యాంకుల క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారు.

! ప్రతి 15 రోజులకోసారి క్లోరినేషన్ చర్యలు చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం.

? సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా.

! సచివాలయాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచడంతో పాటు తనిఖీలు నిర్వహిస్తున్నాం. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

? చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొస్తారా.

! మండలంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే పలు పంచాయతీల్లో కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొచ్చాం.

న్యూస్ బాక్స్

నాగారపమ్మకు పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు అక్షరాభ్యాసం

ఉలవపాడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా సోమవారం నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు అర్చకులు హేమంత్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 10.30వరకు జరిగే ఈ కార్యక్రమంలో 3ఏళ్ల నుంచి 5ఏళ్లలోపు చిన్నారులతో సరస్వతీదేవి పూజ చేయిస్తామని పేర్కొన్నారు. అలాగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో ఆదిగురువు పరమేశ్వరుడితో పాటు, సరస్వతీదేవి అనుగ్రహం కలిగేలా పూజలు చేస్తామన్నారు.

అందరి కలలను సాకారం చేసిన కేంద్ర బడ్జెట్

జలదంకి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికమంత్రి శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజల కలలను సాకారం చేసేలా బడ్జెట్ ఉందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఈవిషయంపై ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాది రూ.12లక్షల ఆదాయం వచ్చే వారికి ఎలాంటి పన్నులు లేకుండా చేయడం మధ్యతరగతి ప్రజలకు ఉపయోగంగా ఉందన్నారు. కేంద్రబడ్జెట్ 2025-26 ప్రదాని మోదీ దార్శనికత, స్వావలంబన, వృద్ధి, శ్రేయస్సుతో కూడిన వికసితభారత్‌గా కొనియాడారు.

వ్యర్థాలతో నిండిన హైవే సర్వీసు రోడ్డు



సర్వీస్ రోడ్డుపై ఉన్న తాగిపడేసిన కొబ్బరి బోండాలు, వ్యర్థాలు

కావలి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లతో ఆహ్లాదంగా ఉండాల్సిన వెంగయ్యగారిపాలెం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు చెత్తచెదారాలు, జంతువ్యర్థాలు, కాలంచెల్లిన మందులు, వాడిపడేసిన నీడిల్స్, తాగి పారవేసిన కొబ్బరి బోండాలతో కంపుకొడుతున్నాయి. అప్పుడప్పుడు వీటిని తగలేస్తుండటంతో రోగాల పాలవుతున్నట్లు ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నెల్లూరు సిటీ

రూరల్, కోవూరు, సర్వేపల్లి



కార్యాలయ విధులు నిర్వహిస్తూ ఫైళ్లు తీసుకెళుతున్న సెక్యూరిటీ సిబ్బంది (ఫైల్)

సిబ్బంది కోత

- జీజీహెచ్‌లో మార్పులు
- ఎఫ్‌ఎన్‌వో, ఎంఎన్‌వో విధుల్లో పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది
- ఆ బాధ్యతల నుంచి వారి తొలగింపు
- రోగుల సేవకు మిగిలింది 32 మందే!

రోగులకు వెత

● అన్ని విభాగాల్లోనూ అసౌకర్యం ● వార్డుల్లో బెడ్‌షీట్లు మార్చేదెవరు? ● మృతదేహాలను తీసుకెళ్లేవారేరి?

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తాజాగా చోటుచేసుకున్న మార్పులతో రోగులకు తీవ్ర అసౌక ర్యం కలుగుతోంది. ఇక్కడ ప్రభుత్వపరంగా ఎఫ్‌ఎన్‌వో (ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ), ఎంఎన్‌వో(మేల్ నర్సింగ్ ఆర్డర్లీ)లు 32 మందే ఉన్నారు. ఇంత పెద్ద ఆసుపత్రికి అంత తక్కువ మంది సరి పోకపోవడంతో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు ఆ బాధ్య తలు నిర్వర్తిస్తున్నారు. 2020 నుంచి వీరే సదరు సేవలు అందిస్తు న్నారు. రోగులకు బెడ్లపై దుప్పట్లు మార్చడం మొదలు దోబీలుగా, కదలలేని రోగులను వైద్య పరీక్ష లకు తీసుకెళ్లడం, జీజీహెచ్ కార్యా లయం అటెండర్లుగా మార్చురీకి మృతదేహాలు తరలించే వరకు అన్నీ రకాల సేవల్లోనూ వీరు భాగస్వాము లవుతున్నారు. అలాగే రోగులకు మంచి నీటిని అందించే మూడు ఆర్‌వో ప్లాంట్ల బాధ్యత ను కూడా వీరే చేపడుతున్నారు. దాదాపు 70 మంది ఈ రకమైన సేవలు అందిస్తు న్నారు. అయితే ప్రభుత్వం ఎఫ్‌ఎన్‌వో, ఎంఎన్‌వో పోస్టులను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా భర్తీ చేస్తామని చెప్పడంతో ప్రస్తుతం ఆ సేవలు అందిస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బందిని సదరు విధుల నుంచి తొలగించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ సిబ్బంది పారిశుధ్య, భద్రతా విధులకే పరిమితం కానున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగంలో ఉన్న 32 మందిపై బాధ్యత పడింది. ఫలితంగా రోగుల సేవలు సన్నగిల్లే అవకాశం ఉంది.

బెడ్‌షీట్లు మార్చే వారూ లేరు

ప్రభుత్వం ఎఫ్‌ఎన్‌వో, ఎంఎన్‌వోలను ఎప్పుడు నియమిస్తుందో నిర్దిష్ట మైన ప్రకటన లేదు. కానీ ఈలోపు ప్రత్యామ్నాయ సేవలు అందిస్తున్న వారిని ఆ విధుల నుంచి తొలగించడంతో రోగులకు ఇబ్బందులు ఎదురవు తున్నాయి. రోగుల పడకలపై దుప్పట్లు మార్చేవారు కూడా కరువయ్యారు. ఎమర్జెన్సీ విభాగానికి వచ్చే రోగుల పరిస్థితి మరీ అధ్వానంగా మారే అవకాశం ఉంది. రోగులు మరణిస్తే మృతదేహాలను తరలించే వారు అందుబాటులో ఉండని పరిస్థితి. ఈ క్రమంలో అధికారుల నిర్ణయంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



మృతదేహం తరలింపునకు సహాయపడుతున్న కార్మికురాలు (ఫైల్)

ఉన్న వారితోనే పని చేయించుకుంటాం



ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రభుత్వానికి చెందిన 32 మంది ఎఫ్‌ఎన్‌వో లు, ఎంఎన్‌వోలు ఉన్నారు. వారితోనే రోగుల కు సంబంధించి అన్నీ పనులు చేయించు కునేలా చర్యలు తీసుకుంటాం. రాష్ట్ర ప్రభు త్వం ఏజెన్సీల ద్వారా ఎఫ్‌ఎన్‌వో, ఎంఎన్‌వోల నియామకం చేపడతామని వెల్లడించింది. దీనికి అనుగుణంగా ప్రస్తుతం ఎఫ్‌ఎన్‌వో, ఎంఎన్‌వో బాధ్యతలు నిర్వ హిస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీలను ఆ విధుల నుంచి తొలగించి వారి పనులు సక్రమంగా నిర్వహించేలా చూస్తున్నాం.

- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఎన్టీఆర్ సుజల స్రవంతి

లక్ష్యం నెరవేరేనా..!?

● ప్రజలు గొంతు తడిసేనా..?
● వైసీపీ పాలనలో మరుగున పడిన పథకం
● పాలకుల నిర్లక్ష్యంతో పెరగనున్న వ్యయం



చిట్టేపల్లి తిప్ప వద్ద నిరుపయోగంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్

పొదలకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టేపల్లి తిప్ప వద్ద గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన సుజల స్రవంతి పథకం లక్ష్యం ఈ ఏడా దైనా నెరవేరుతోందా అన్నది చర్చనీయాంశం అయిం ది. ప్రతి ఇంటికి మినరల్ వాటర్ అందించేందుకు పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లి తిప్ప వద్ద రూ.4.70 కోట్లతో మదర్ ప్లాంట్, ఏడు వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసి అక్కడి నుంచి చుట్టుపక్కల గ్రామాలకు ట్యాంకర్లతో నీరం దించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మేరకు దీని నిర్మాణం పూర్తిచేసి 2019 మార్చి 6న ప్రారంభించారు. కొన్ని రోజులు నీటిని సరఫరా చేశారు. అంతలో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ పథకానికి గ్రహణం పట్టింది. మెట్ట ప్రాంతమైన మండల వాసులకు సురక్షిత నీరు అందించాలన్న అప్పటి ప్రభుత్వం ల క్ష్యం నీరు గా రింది. పేదవా రికి కేవలం రూ.2లకే 20 లీటర్ల నీటిని వారి గ్రామంలోనే కార్డు ద్వారా పట్టుకునేలా ఈ పథకాన్ని రూ పొందించారు. మండలంలోని 35 చోట్ల వీటికి సంబంధించిన మినీ ట్యాంకుల షెడ్ల నిర్మాణం చేపట్టి అక్కడక్కడ కొన్ని నిర్మించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రిమోట్ డిస్పెన్సరీ యూనిట్ (ఆర్డీయూ)ల ద్వారా ఏటీఎం తరహాలో కార్డు పెట్టి నీరు పట్టుకునేందుకు అవకాశం కల్పించారు. వీటికి సంబంధించిన పనులు 80 శాతం పూర్తయ్యాయి. అలాగే చిట్టేపల్లిలో కూడా మదర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. బోరు వేసి నీటి పరీక్షలు చేసి కనెక్షన్ ఇచ్చారు. అక్కడ నుంచి చుట్టుపక్కల 35 ఆవాస ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు ఏడు స్టీల్ ట్రాక్టర్ ట్యాంకర్లను సిద్ధం చేశారు. దీనిని వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యం చేయడంతో నిరుపయోగం అయింది. ఇప్పుడు ఈ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడానికి దాదాపు రూ.3.50 కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా విద్యుత్ బకాయిలు కూడా రూ.కోటి వరకు ఉన్నట్లు సమాచారం. వైసీపీ చేసిన నిర్లక్ష్యం కారణంగా మండల వాసులు మినరల్ వాటర్‌ని అందుకోలేకపోయారని, అప్పటి ప్రతిపక్ష నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చాలాసార్లు ఆరోపించారు. వేల మందికి ప్రయోజనం కలిగే ఈ పథకాన్ని నిలిపేయడం అన్యాయమని అప్పటి వైసీపీ ప్రభుత్వానికి విన్నవించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే హోదాలో ఈ వాటర్ ప్లాంట్‌ను తిరిగి వినియోగంలో తేవడానికి ఆయన విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే అధికారులతో అంచనాలు సిద్ధం వేయించారు. పెద్ద మొత్తం కావడంతో రాబోయే బడ్జెట్‌లో వీటికి కేటాయింపులు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వేసవి నాటికైనా ఈ పథకం అందుబాటులోకి వస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పర్యాటక కేంద్రంగా గంగపట్నం అభివృద్ధి

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



హోమంలో వస్త్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చాముండేశ్వరిదేవి ఆశీస్సుల లో గంగపట్నంను ధార్మిక క్షేత్రంగా అభివృద్ధి చేస్తానని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండలంలోని గంగపట్నంలో ఆదివారం జరిగిన చాముండేశ్వరి ఆలయ మహాకుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రశాంతిరెడ్డికి ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌స్వామి, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి మహాకుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గం లోని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. శక్తిస్వరూపిణీ అయిన అమ్మవారిని సేవించడం వలన మానసిక వ్యాధులు, గ్రహదోషాలు, రోగాలు తొలగిపోతాయన్నారు. గంగపట్నంను పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, కొండూరు సుధాకర్ రెడ్డి, దుగ్గా శంకర్‌రెడ్డి, అవ్వారు ఏడుకొండలు, కృష్ణారెడ్డి, వెంకటరమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణపై అవగాహన



విజేతలకు బహుమతి అందిస్తున్న జేడీ రమేష్ నాయక్ పక్కన ఏడీ తదితరులు

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని పశుసంవర్ధకశాఖ జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జంతు సంరక్షణ ఆవస్యకత, చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్ నాయక్ పాల్గొని జంతు సంరక్షణ సామాజిక బాధ్యతని చెప్పారు. జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. జంతు సంరక్షణ, సంక్రమిత వ్యాధులపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ షీప్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు(ఐఎస్‌డీపీ) ఏడీ మాధవీలత, ఫౌండేషన్ ఫర్ ఎనిమల్స్ వలంటరీ ఆర్గనైజేషన్ సంస్థ కన్వీనర్ ఉమాదేవి, రవాణా అధికారులు పాల్గొన్నారు.

స్టేడియంలో వైద్య శిబిరం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దివంగత కిలారి వెంకటస్వామి నాయుడు జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వాకర్స్ సంఘం మాజీ అధ్యక్షుడు కిలారి తిరుపతి నాయుడు మాట్లాడుతూ వెంకటస్వామి నాయుడు జ్ఞాపకార్థం ఏడాది పాటు ప్రతినెలా వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వాకర్స్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీ సత్యం, కార్యదర్శి స్నేహ సురేష్, డాక్టర్ శ్రీనివాస కుమార్, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, వేలూరు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి మరో కౌన్సిలర్

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీలో సోమవారం వైస్ చైర్మన్ల ఎన్నిక జరగనున్న తరుణంలో ఆదివారం రాత్రి 9వవార్డు కౌన్సిలర్ ఎరటపల్లి శివ కుమార్‌రెడ్డి కోవూరు మండలం లేగుంట పాడులోని వీపీఆర్ అతిథి గృహంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ సమక్షంలో టీడీపీలో చేరారు. మరో ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు కూడా సోమవారం టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

నేడు వసంత పంచమి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలు జరుగుతాయని ఆలయ ఈవో వీ గిరికృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అమ్మవారు సరస్వతీ అలంకారంలో దర్శనం ఇస్తారని, భక్తులు తరలిరావాలని కోరారు.

రేపు కందప్ప మేస్త్రి జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అరణి కందప్ప మేస్త్రి సత్రం దాత అరణి కందప్ప మేస్త్రి జయంతి మంగళవారం జరుగుతుందని ఆ సత్రం ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కలిగిన విద్యార్థులు, పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు, అన్నక్యాంటీన్ల ద్వారా దాత పేరున అన్నదానం, వీల్ చైర్స్ బహూకరణ, పేదలకు దుప్పట్లు, దోమ తెరలు, విశ్వభారతి అంధుల పాఠశాల విద్యార్థులకు కిట్లు, పేద బ్రాహ్మణులకు వస్త్రదానం, అన్నదానం జరుగుతాయని తెలిపారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు, ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం స్కూల్ పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ ఆలయ భూమి కబ్జా

● కూడలి వద్ద మూడు రోజులుగా నిర్మాణాలు ● కామాక్షమ్మ ఆస్తికి రక్షణ కరువు



ఆక్రమిత స్థలంలో నిర్మాణ పనులు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి ఆలయ ఆస్తి ఆక్రమణకు గురైంది. నెల్లూరు రూరల్ మండల పరిధిలోని జొన్నవాడ కూడలి వద్ద మునేశ్వరస్వామి ఆలయ సమీపంలో 200 అంకణాల కామాక్షమ్మ ఆలయ స్థలాన్ని కొందరు ఆక్రమించి మూడు రోజులుగా నిర్మాణాలు జరుపుతున్నారు. పగలు, రాత్రి తేడాలేకుండా ఇక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ ఆలయ అధికారులు మౌనం వహించడంపై అను మానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ స్థలం విలువ సుమారు. రూ.1.40 కోట్లు ఉంటుందని అంచనా. ఇంతటి విలువైన అమ్మవారి ఆస్తిని కాపాడాలని భక్తులు కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సహజ వనరులతోపాటు ప్రభుత్వ ఆస్తులు విచ్చలవిడిగా ఆక్రమణలకు గురయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా అదే పరంపర కొనసాగుతుండటం గమనార్హం.

దేవాలయమే ధర్మం

● గణపతి సచ్చిదానంద స్వామి



గోపూజ చేస్తున్న అవధూత గణపతి సచ్చిదానంద స్వామీజీ



చక్రార్చన చేస్తున్న ఉత్తర పీఠాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజీ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దేవాలయమే ధర్మం అని ఆ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి ప్రబోధించారు. దత్తపీఠం ఆధ్వర్యంలో కొనసాగుతున్న దత్తక్షేత్రాలలో ధూపదీప నైవేద్య కైంకర్యాలకు ప్రతి ఆలయానికి రూ.కోటి కార్పస్ ఫండ్ ఉండేలా యాజ మాన్య కమిటీలు చూసుకోవాలని ఆదేశించారు. నెల్లూరు సుజాతమ్మకాలనీ లోని అష్టలక్ష్మీ ఆలయంలో ఆదివారం భక్తులు, పాలక మండలి సభ్యులు, దాతలను ఉద్దేశించి స్వామీజీ ప్రసంగించారు. రూ.కోటి కంటే తక్కువ నిధి ఉన్న క్షేత్రాలకు ఆ మిగిలిన మొత్తాన్ని దత్తపీఠం ట్రస్ట్ నుంచి అందజేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో నెల్లూరు క్షేత్రానికి రూ.63లక్షల ఫండ్ ఉండగా మిగతా రూ.37లక్షలను స్వామివారు అందజేశారు. భగవద్గీత నేర్చుకుని బంగారు పతకాలు సాధించిన నెల్లూరు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కాగా, ఆదివారం ఉదయం ఆలయంలో స్వామీజీ గోపూజ చేశారు. ఆయన పర్యవేక్షణలో ఉత్తర పీఠాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజీ శ్రీచక్రార్చన నిర్వహించారు. అనంతరం జరిగిన లక్ష్మీనారాయణ హోమం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. రాత్రి స్వామీజీ కృష్ణామృత రాగ సాగర నాద ధ్యాన కచేరీ నిర్వహించి భక్తులను అనుగ్రహించారు. గణపతి సచ్చిదానంద శ్రీకృష్ణ జ్ఞాన బోధ సభా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టీలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల సమావేశం

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 2 : జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం సమావేశం ఆదివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగింది. ఈ నెల 9న గుంటూరులో జరిగే సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలపై చర్చించారు. వివిధ కోర్టులలో అధిక సంఖ్యలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీకువెళ్లాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై సురేష్, పీవీ నారాయణరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు వేణుగోపాల్ నాయుడు, నాయకులు సునీల్, శివకుమార్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

● ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మహిళ లు, చిన్నారుల రక్షణ చట్టాల పై ప్రతి ఒక్కరూ అవగా హన కలిగి ఉండాలని మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వెంకటేశ్వరపురం గాంధీ గిరిజన కాలనీలో ఆదివారం మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలపై అవగాహ న సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహలు చట్టరీత్యా నేరమన్నారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాల బారినపడితే వెంటనే 1930 నెంబరుకు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మత్తు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కాలనీ వాసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఏఎస్‌ఐలు వై శ్రీహరి, డీ సతీష్, సిబ్బంది కే ప్రసాద్, టీవీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర లా సెల్ కన్వీనర్‌గా సింధూర్ సావంత్ ఎంపికపై హర్షం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర లాసెల్ కన్వీనర్‌గా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన సింధూర్ సావంత్‌ను నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీలలో విశాఖపట్నంలో జరిగిన ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర, జిల్లా నూతన కార్యవర్గాల నియామకం జరిగింది. ఈ మేరకు బుచ్చికి చెందిన సింధూర్ సావంత్‌కు ఏవీఎస్ రాష్ట్ర లాసెల్ కన్వీనర్‌గా పదవి దక్కడంతో ఆయన స్నేహితులు, ఆత్మీయులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

స్పీడ్ మ్యాథ్స్‌లో విద్యార్థుల ప్రతిభ



స్పీడ్ మ్యాథ్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

విడవలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో విశ్వం ఎడుటెక్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జోనల్ లెవల్ అబాకస్, వేదిక్ మ్యాథ్స్ (స్పీడ్ మ్యాథ్స్) పోటీల్లో వావిళ్లలోని ప్రగతి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాము తెలిపారు. ఈ పోటీల్లో 23 పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వీరిలో అత్యధికంగా ప్రగతి ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు జశ్వంత్ కేశవ, ధనుష్‌కుమార్, మోహనకృష్ణ, మహేష్, శరణ్యశ్రీ, లీలాకళ్యాణి, మనస్వినిలు తమ ప్రతిభను చాటారన్నారు. వీరికి ఓ పాఠశాల అధినేత ఎంవీ.సుబ్బారెడ్డి బహుమతులను అందజేశారు.

పరిశ్రమల రాకతో నిరుద్యోగులకు ఉపాధి

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చొరవతో రాష్ట్రానికి అనే పరిశ్రమలు వస్తున్నాయని, దీని వల్ల నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని 1, 2 డివిజన్లలో రూ. 20.65 లక్షల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మరిన్ని నిధులు సమీకరించి నియోజకవర్గంలో మరింతగా అభివృద్ధి పనులు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కార్యకర్తలు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రామ్మోహన్, నాయకుడు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నిర్వహి స్తున్న గడప గడప కార్యక్రమం ఆదివారం కొనసాగింది. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియ చేశారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థిని రూపాలి ఎంపిక

పొదలకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు పట్టణంలోని నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థిని కాకులూరు రూపాలి రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైందని ఆ పాఠశాల కరస్పాండెంట్ బీ.సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్.లక్ష్మీదుర్గ తెలిపారు. నెల్లూరు నగరంలో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఓ స్కూల్ ఆదివారం జరిగిన అబాకస్ జోనల్‌స్థాయి పోటీల్లో కె.రూపాలి అత్యుత్తమ ప్రతిభ కనపరిచి విజేతగా నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని, త్వరలో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. దీంతో ఆ విద్యార్థినిని, గైడ్ చేసిన ఉపాధ్యాయినులు పవిత్ర, ఎస్.వైష్ణవిలను పాఠశాల చీఫ్ అడ్వైజర్ సుబ్బారావు, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, జీ.ఎన్.రెడ్డి, డీన్ సీహెచ్.కృష్ణ, ఏవో జీవీఆర్, విద్యార్థులను అభినందించారు.

కమ్యూనిటీ పారామెడిక్స్ డైరీ ఆవిష్కరణ



అసోసియేషన్ డైరీ ఆవిష్కరిస్తున్న గిరినాయుడు, పక్కన సంఘం నాయకులు, సభ్యులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ పారామెడిక్ వెల్ఫేర్ అసోసి యేషన్ నూతన సంవత్సర డైరీని టీడీపీ నేత, కిమ్స్ ఆసుపత్రి ఈడీ తాళ్లూరి గిరినాయుడు ఆదివారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ ప్రజలు ప్రాణాలు కాపాడుతున్నారని కమ్యూనిటీ పారామెడిక్స్‌ను అభినందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఖాజా మియ్యా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సిరాజ్, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరి కేశవ చౌదరి, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, ఉపాధ్యక్షులు శర్మ, సయ్యద్ ఖాజా మొహిద్దీన్, చాంద్‌బాషా, సమాచార ప్రచార కార్యదర్శి ప్రసాద్, చెన్నై ఇన్ఫర్మేషన్ సెంటర్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

కాపు టీచర్స్ క్యాలెండరు ఆవిష్కరణ



మంత్రి నారాయణను పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్, పాకెట్ డైరీలను రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదివారం ఆవిష్కరించారు. మంత్రి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు కంటే వెంకట రమణిని మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి ఫణీంద్రకుమార్, ఉపాధ్యక్షుడు చెన్నకేశవుల రమేష్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు వడ్ల విష్ణుమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి

● బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సుభాష్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు మొండి చేయి చూపించారని, దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు కేవలం రూ.2500 కోట్లు కేటాయించారని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సుభాష్ యాదవ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. రూ.50.65లక్షల కోట్ల బడ్జెట్‌లో దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు రూ.2500కోట్లే కేటాయిం చడం భిక్ష వేసినట్లుగా ఉందని విమర్శించారు. తక్షణమే బీసీలకు రూ.2లక్షల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.



నగరి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు



మృతదేహాలు

పార్థసారథి నాయుడు - రాజేంద్రనాయుడు - ధనుష్కోటి - కుమార్



రక్తమోడిన రహదారి



ఓవైపు సగభాగం దెబ్బతిన్న బస్సు

- ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రైవేటు బస్సును ఢీకొట్టిన లారీ
- నలుగురి దుర్మరణం
- 13 మందికి తీవ్రగాయాలు
- వీరిలో ఒకరి పరిస్థితి విషమం
- రాత్రి 9 గంటలకు ప్రమాదం

నగరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణం సాయిబాబా గుడి సమీపంలోని తిరుపతి- చెన్నై జాతీయ రహదారి ఆదివారం రాత్రి 9 గంటలకు రక్తమోడింది. తమిళనాడుకు చెందిన ఓ ప్రైవేటు బస్సు ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో ఎదురుగా ఓ లారీ ఢీకొట్టుకుంటూ వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బస్సుకు ఒకపక్క సగభాగం వరకు ధ్వంసమైంది. గాయపడ్డ ప్రయాణికుల హాహాకారాలతోపాటు రోడ్డంతా రక్తసిక్తమైంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కొంతసేపు నిశ్చేష్టులయ్యారు. ఆ తర్వాత తేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులను స్థానికులు, పోలీసులు, 108 వాహన సిబ్బంది కలిసి నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. డ్యూటీలోని సిబ్బంది కాకుండా వైద్యులు, ఇతర సిబ్బంది హుటాహుటిన వచ్చి బాధితులకు చికిత్స ప్రారంభించారు. ఆస్పత్రి రోదనలతో నిండిపోయింది. నగరి డీఎస్పీ అజీజ్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

మృతులు: తిరుత్తణికి చెందిన కుమార్(60), తిరువళ్లూరుకు చెందిన ధనుష్కోటి(12), వడమాలపేట మండలంలోని సీతారామాపురానికి చెందిన పార్థసారథి నాయుడు (62) రాజేంద్రనాయుడు(60).

గాయపడినవారు: రాధాకృష్ణ(తాడిపత్రి),సెల్వి(తిరుపతి),వెట్రివేల్(తిరువళ్లూరు),భరత్ (తిరుపతి), మురళి (ఊత్తుకోట), రుద్రమూర్తి (తిరువళ్లూరు),సుబ్బరత్నమ్మ (తాడిపత్రి), సుధాకర్(తిరువళ్లూరు), చిన్నామలై(తిరువళ్లూరు),నాగేంద్ర(తాడిపత్రి), ఆయన తల్లి,అనూరాధ దంపతులు (శివగిరి). పరిస్థితి విషమంగా ఉన్న చిన్నామలైని తిరుపతికి తరలించారు.

తిరుత్తణిలో పెళ్లికి వెళ్లొస్తూ..

- 'నగరి' ప్రమాద మృతుల్లో ఇద్దరిది సీతారామపురం

ఆదివారం ఉదయం.. గ్రామస్తులతో కలిసి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను పార్థసారథి నాయుడు(62), రాజేంద్ర నాయుడు(60) కలిశారు. అమరావతి అభివృద్ధికి తమ గ్రామం తరపున రూ.50 వేలు అందజేశారు. సాయంత్రం ఇద్దరూ కలిసి తిరుత్తణిలో పెళ్లికి వెళ్లారు. తిరిగొచ్చే క్రమంలో నగరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సులోని ఈ ఇద్దరు టీడీపీ నేతలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ ఇద్దరూ సమీప బంధువులు. వీరి మృతి సమాచారంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పార్థసారథి నాయుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉన్నాడు. రాజేంద్రకు ఓ కుమార్తె ఉంది. వీరిద్దరూ వ్యవసాయదారులే. వీరి మృతి పట్ల ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సంతాపం తెలియజేశారు. వీరి కుటుంబాలకు అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్యేకు చెక్కు అందిస్తున్న సీతారామాపురానికి చెందిన టీడీపీ నాయకులతో పార్థసారథి నాయుడు, రాజేంద్రనాయుడు (సర్కిల్‌లోని వ్యక్తులు)



1. ఇంట్లో చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు
2. సీసీ కెమెరాల్లో రికార్డయిన దొంగలు
3. వెనుక గేటు తాళం పగలగొట్టి లోపలకు వెళ్లారిలా..

సోలార్ ఫెన్సింగ్ కట్ చేసి.. గోడ దూకి

తిరుపతిలో రెచ్చిపోయిన దొంగలు

- రెండు విల్లాల్లో 720 గ్రాముల బంగారం, రూ.4.50 లక్షల నగదు, 1.650 కిలోల వెండి అపహరణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం వద్దనున్న సీపీఆర్ విల్లాస్‌లో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. రెండు విల్లాల్లో దాదాపు 780 గ్రాముల బంగారు నగలు, 1.650 కిలోల వెండి వస్తువులు, రూ 4.5 లక్షల నగదు అపహరించుకెళ్లారు. ఈ వివరాలను ఆదివారం తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. సీపీఆర్ విల్లాస్‌లోని 81వ నెంబరు ఎలక్ట్రానిక్ సంస్థలకు సలహాదారుగా పనిచేస్తున్న మేఘనాదన్ నివాసం ఉంటున్నారు. బంధువుల పెళ్లి ఉండటంతో బ్యాంకు లాకర్ నుంచి బంగారు నగలు, వెండి వస్తువులను శనివారం తీసుకొచ్చారు. మేఘనాదన్ దంపతులు మొదటి అంతస్తులో.. అతని అత్త, కుమారుడు రెండో అంతస్తులో పడుకున్నారు. లాకర్ నుంచి నగలు తెచ్చిన విషయాన్ని గమనించిన దుండగులు చోరీకి ప్లాన్ చేశారు. శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు ఐదారు మంది విల్లా వెనుక ఖాళీ స్థలం నుంచి ప్రహరీ సోలార్ ఫెన్సింగ్ కట్ చేశారు. వ ం ట్టి డంప్‌పైకి ఎక్కి గోడ దూకి లోపలకు వెళ్లారు. మొదట ఇద్దరు 81వ నెంబరు విల్లా వెనుక వైపున్న అల్యూమినియం డోర్ లాక్‌ను కట్ చేశారు. బెడ్‌రూములో భద్రపరచిన 735 గ్రాముల బంగారు నగలు, 1.650 కిలోల వెండి వస్తువులు, 800 యూఎస్ డాలర్లు, రూ.4.50 లక్షల నగదు అపహరించారు. ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేశారు. ముందుగానే హాలులో ఉన్న రెండు సీసీ కెమెరాలను పగలగొట్టారు. అయితే మేఘనాదన్ మొబైల్ నెంబరుకు నెట్ కనెక్టు అయి ఉండటంతో దొంగల ఫొటోలు అందులో నిక్షిప్తంగా పోలీసులకు కొంతవరకు ఆధారాలు దొరికాయి.

విల్లా నెంబరు 82లోనూ..

ఇక్కడి విల్లాస్‌లోని 82లో దొర ప్లాస్టిక్స్ అధినేత కేశవులు నాయుడు కుమారుడు జగదీష్ నివాసం ఉంటున్నారు. వీరి కుటుంబ సభ్యులు మొదటి అంతస్థులో పడుకుని ఉన్నారు. ఈ విల్లా వెనుక అల్యూమినియం డోర్‌లాక్‌ను స్క్రూ డ్రైవర్‌తో పగులకొట్టి లోపలకు ప్రవేశించారు. బెడ్‌రూములో భద్రపరచిన 45 గ్రాముల బంగారు నగలు, నాలుగు డైమండ్ లాకెట్లు, బ్లాక్ బీట్‌లు మూడు, చెవికమ్మలు ఒక జత అపహరించారు. ఇదే విల్లా నుంచి రెండు బ్యాగుల్లో వున్న మూడు కిలోల వెండి వస్తువులను ప్రహరీ బయట పడేసి వెళ్లారు. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకుని జగదీష్‌కు అప్పగించారు. అలాగే, వ్యాపారవేత్త శ్రీనివాసరావు, కాశీవిశ్వనాథ్‌కు చెందిన 78, 80 విల్లాల్లోనూ చోరీకి యత్నించారు. ఇక్కడ, కిటికీ స్లైడింగ్ తీసి సీసీ కెమెరాలు పక్కకు నెట్టి లోపలకు వెళ్లారు. కానీ, ఎటువంటి చోరీ జరగలేదు.. రెండు విల్లాల్లో చోరీపై బాధితులు తిరుపతి క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు.



విల్లా వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

పోలీసుల పరిశీలన

తిరుపతి క్రైం, శాంతిభద్రతల ఏఎస్పీలు నాగభూషణరావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు శ్యాంసుందర్, నరసింగప్ప, సీఐలు చిన్నగోవిందు, శివకుమార్ రెడ్డి, తిరుచానూరు ఎస్‌ఐలు అరుణ, జగన్నాథ రెడ్డి, సాయినాథ చౌదరి, క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వేలిముద్రలు, దొంగలు ఎర్రమట్టి తొక్కి వచ్చిన పాద ముద్రలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఐదారు మంది ఈ చోరీలకు పాల్పడినట్లు తెలిసింది. ప్రతి ఇంట్లోకి ఇద్దరేసి వెళ్ళినట్లు పోలీసులు చెబుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎస్పీ హర్షవర్ధనరాజు ఘటనా స్థలానికి చేరుకుని చోరీలు ఎలా జరిగాయని ఆరా తీసారు. దొంగల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలన్నారు. క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సెనెట్ హాలులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ శుభంబన్సల్

నేడే డిప్యూటీ మేయర్ ఎన్నిక

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- క్యాంపుల నుంచి కార్పొరేటర్ల తిరుగుముఖం

తిరుపతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హైడ్రామాకు తెరలేపిన తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక క్లైమాక్స్‌కు చేరుకుంది. సోమవారం ఉదయం 11 గంటలకు ఎస్వీ విశ్వవిద్యాలయం సెనెట్ హాలులో ఎన్నిక జరగనుంది. డిప్యూటీ మేయర్ పదవి ఎవరిని వరిస్తోందనని సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. క్యాంపులకు వెళ్లిన కార్పొరేటర్ల చేతిలో డిప్యూటీ మేయర్ విజయం దాగుంది. వివిధ ప్రాంతాల్లో విడిది చేస్తున్న కార్పొరేటర్లు తిరుపతికి తిరుగుముఖం పట్టారు. 50 డివిజన్లు కలిగిన తిరుపతి కార్పొరేషన్లో వివిధ కారాణల వలన 3 డివిజన్లకు కార్పొరేటర్లు లేరు. అంటే 47 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు ఓటు హక్కు వినియోగించుకుంటే ఆ సంఖ్య 50కు చేరుతుంది. ప్రస్తుతం కూటమి చెంత 24 మంది కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యుడైన ఎమ్మెల్యే ఓటు కలిపితే 25 ఉన్నాయి. వైసీపీ కార్పొరేటర్ ఒకరు అనారోగ్య కారణంగా రాలేకపోతున్నట్టు సమాచారం దీంతో వైసీపీకి ఎంపీ, ఎమ్మెల్సీ రెండు ఓట్లు కలుపుకొన్నా.. ఒక ఓటు ఆధిక్యతతో కూటమి అభ్యర్థి గెలుపొందుతారు. అదేకాకుండా వైసీపీ క్యాంపులో ఉండే కార్పొరేటర్లలో ముగ్గురు కూటమివైపు చేతులెత్తే సూచనలున్నాయి. వైసీపీ విప్ జారీ చేసిన నేపథ్యంలో ఎవరికీ చేతులెత్తకుండా మౌనంగా ఉండే కార్పొరేటర్లు కూడా లేకపోలేదన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి ఉత్కంఠకు తెరపడాలంటే మరికొన్ని గంటలు వేచిచూడాల్సి వుంది.

పకడ్బందీ ఏర్పాట్లు

డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న జేసీ శుభంబన్సల్ ఆదివారం ఎస్వీయూ సెనెట్ హాలులో ఏర్పాట్లను పరిశీలించారు.ఈ ప్రత్యేక సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న నేపథ్యంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ముందుగానే సెనెట్ హాలుకు రావాలని సూచించారు.సెల్‌ఫోన్లు, బంధుమిత్రులకు అనుమతి లేదన్నారు. గుర్తింపు కార్డు తప్పనిసరని చెప్పారు. జేసీతో పాటు అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, ఎస్ఈ సురేంద్ర, సెక్రటరీ రాధిక, తహసీల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వేద వర్సిటీలో చిరుత!



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వేద యూనివర్సిటీలో చిరుత సంచారం విద్యార్థులను కలవర పెడుతోంది. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో రామేశ్వరం భవన్‌కు ఎదురుగా గల చెట్ల పొదల్లో చిరుత కనిపించింది. అటువైపుగా వెళుతున్న వర్సిటీ ఉద్యోగి ఒకరు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బందికి ఆయన సమాచారాన్ని చేరవేశారు. వారు సెక్యూరిటీ వాహనంలో సైరన్ మోగించినా చిరుత కదలకపోవడం గమనార్హం. వేద వర్సిటీలో ఏదో ఒక చోట చిరుత సంచరిస్తుండటం విద్యార్థులు, ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది.

రేపటి రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి

- ఉదయం నుంచి రాత్రి వరకు వాహనసేవలు

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం జరిగే రథసప్తమికి టీటీడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. వేకువజాము నుంచి రాత్రి వరకు మలయప్పస్వామి ఏడువాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. వాహన సేవలను తిలకించేందుకు గ్యాలరీల్లో కూర్చునే భక్తులు ఎండకు, చలికి ఇబ్బంది పడకుండా తాత్కాలిక షెడ్లు వేశారు. నిరంతరాయంగా సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర, పొంగళి తదితర అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, టీ, కాఫీ, పాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, మరుగుదొడ్లను సిద్ధం చేశారు.

వాహన సేవలిలా..

ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు సూర్యప్రభవాహనం, 9-10 వరకు చిన్నశేషవాహనం, 11-12 వరకు గరుడవాహనం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు హనుమంతవాహనం, వెంటనే చక్రస్నానం, సాయంత్రం 4- 5 వరకు కల్పవృక్ష, 6-7 వరకు సర్వభూపాల, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభవాహన సేవలను నిర్వహించనున్నారు.





మాడవీధుల్లోని గ్యాలరీల్లో వేసిన షెడ్లు

అన్న పిల్లలపై తమ్ముడి కర్కశత్వం




చిన్నారి నిత్య శరీరంపై వాతలు

మద్యం తాగొచ్చి వాతలు పడేలా దాడి

చిట్టమూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అన్న పిల్లలపై తమ్ముడు కర్కశంగా ప్రవర్తించాడు. మద్యం తాగొచ్చి ఇంట్లో ఒంటరిగా ఉన్న చిన్నారులను కర్రతో వాతలు తేలేలా చితకబాదాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు... చిట్టమూరు మండలం, కోగిలి ఎస్సీ కాలనీకి చెందిన దామరపు రాజయ్య, పోలమ్మ దంపతులకు కుమారుడు జానీ(4), కుమార్తె నిత్య(5) ఉన్నారు. రాజయ్య దంపతులు మేనకూరులోని ఓ పరిశ్రమలో పని చేస్తారు. శనివారం ఇద్దరూ విధులకు వెళ్లారు. సాయంత్రం పొద్దుపోయాక రాజయ్య తమ్ముడు ముత్యాలయ్య పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజయ్య కుమారుడు జానీ, కుమార్తె నిత్యను నిర్బదించి కర్రతో తీవ్రంగా కొట్టాడు. బాబాయ్ ఎందుకు కొడుతున్నాడో తెలియని చిన్నారులు ఏడుస్తూ కాళ్లు, చేతులు పట్టుకొని బతిమలాడినా కనికరించని ముత్యాలయ్య వాతలు పడేలా పిల్లలను కొట్టాడు. అరిస్తే చంపేస్తాని బెదిరించడంతో భయపడిపోయిన చిన్నారులు ఎవరికీ చెప్పుకోలేక నొప్పులతో అల్లాడిపోయారు. రాత్రి 11 గంటలకు ఇంటికొచ్చిన రాజయ్య, పోలమ్మ తమ బిడ్డల శరీరంపై ఉన్న గాయాలను చూసి తల్లడిల్లిపోయారు. ఏం జరిగిందని ఆరా తీయగా బాబాయ్ కొట్టాడని చెప్పారు. వెంటనే పిల్లలను తీసుకొని పోలీస్ స్టేషనుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చిన్న బలరామయ్య కేసు నమోదు చేశారు. నిందితుడు ముత్యాలయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

భార్యపై భర్త కత్తితో దాడి.. ఆపై ఆత్మహత్యాయత్నం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల నడుమ ఏర్పడిన స్వల్ప వివాదంతో ఆవేశానికి లోనైన భర్త, భార్యపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. వెంటనే మనస్తాపానికి గురై తాను కూడా ఆత్మహత్యాయత్నం చేశాడు. నాయుడుపేట పట్టణంలోని కుమ్మరివీధిలో నివాసం ఉంటున్న సురేష్, లత దంపతుల మధ్య కుటుంబకలహాలతో వివాదం ఏర్పడింది. శనివారం అర్ధరాత్రి లతపై సురేష్ కత్తితో దాడి చేశాడు. అదే కత్తితో తానూ పొడుచుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గుర్తించి భార్యభర్తలను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన లత, సురేష్

పంటలకు పరిహారంపై రైతులతో చర్చలు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీలో గల వీటి అగ్రహారంలో భూములకు పరిహారం విషయమై ఆదివారం తహసీల్దారు జయజయరావు రైతులతో చర్చలు జరిపారు. చిల్లకూరు మండలం రాఘవారిపాళెం, కోట మండలం సరిహద్దు గ్రామాల రైతులకు వీటి అగ్రహారంలో భూములు ఉన్నాయి. ఆ భూములు సాగరమాల రోడ్డు విస్తరణకు తీసుకున్నారు. అయితే ఆయా భూముల్లో రైతులు వరి సాగు చేశారు. ఆ పంటలను ధ్వంసం చేసి రోడ్డు వేసేందుకు రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో పరిహారం గురించి రైతులతో చర్చలు జరిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వో రమణయ్య పాల్గొన్నారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్టు



నిందితుడు మస్తానయ్యను అరెస్టు చూపుతున్న పోలీసులు

కోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలం జరుగుమల్లిలోని గమళ్లపాళెంలో గత నెల 30న కొమారి కోటయ్యను అతని తమ్ముడు మస్తానయ్య రోకలితో కొట్టి హత్య చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పరారీలో ఉన్న మస్తానయ్యను కోట హరిజనవాడలోని వాటర్ ట్యాంక్ వద్ద ఆదివారం అరెస్టు చేసినట్లు వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

వెలమ సంక్షేమ సంఘ కార్యవర్గం ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్యనాయుడు

నాయుడుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వెలమ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు గౌరవ అధ్యక్షులు రంగినేని కృష్ణయ్య నాయుడు మునస్వామి నాయుడు తెలిపారు. పుదూరులోని మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో వెలమ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా చింతకాని మధుసూదనరావు, ఉపాధ్యక్షులుగా నేలవల్లి రామచంద్ర నాయుడు, భాస్కర్, రాధాకృష్ణమ నాయుడు, కార్యదర్శులుగా పొట్లపూడి రాజేష్, శేఖర్ నాయుడు, కోశాధికారిగా నేలవల్లి మునికృష్ణ ఎంపికైనట్లుగా వారు పేర్కొన్నారు.


మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్



మీడియాతో మాట్లాడుతున్న బీజేవైఎం నేత మనోజ్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మధ్య తరగతి ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం హర్షణీయమని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మాళవ్యానగర్‌లోని బీజేవైఎం కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల అభివృద్ధికి బడ్జెట్ ప్రాధానం ఇచ్చారని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి పోలవరం, రాజధాని అమరావతి అభివృద్ధి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రణయ్, నవీన్, కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సమన్వయ కమిటీ ఎన్నిక



సమావేశంలో బీసీ సమన్వయ కమిటీ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ బీసీ సమన్వయ కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం బీసీ సంఘాల జిల్లా అధ్యక్షుడు రాజమాణిక్యం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జమాలుల్లా, కన్వీనర్‌గా ఎల్‌వీ సుబ్బయ్య, కో- కన్వీనర్లుగా గురునాధం, శేషయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాశిన భాస్కర్‌గౌడ్, వెంకటేశ్వర్లురాజు, కొండల్‌రావు, కోటేశ్వర రావు, జయచంద్ర, రమణయ్య, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, లక్ష్మీదేవి దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాము, మయూరి శ్యామ్ యాదవ్, నాగరాజు, ప్రభాకర్, పురందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెటర్నరీలో అధ్యాపకులకు సీఏఎస్ ఇంటర్వ్యూలు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని టీచింగ్ ఫ్యాకల్టీకి సోమవారం నుంచి కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) పదోన్నతులకు సంబంధించిన ఇంటర్వ్యూలు ప్రారంభం కానున్నాయి. తిరుపతి కేంద్రంగా నడిచే వర్సిటీ పరిపాలనా భవనంలో ఈ నెల 3, 5, 6, 8 తేదీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. సెలక్షన్ కమిటీ నేతృత్వంలో జరిగే ఇంటర్వ్యూలకు పదోన్నతికి అర్హత సాధించిన అధ్యాపకులు విభాగాల వారీగా ఆయా తేదీల్లో ఉదయం 9గంటలకు హాజరు కావాలని ఎస్‌వీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.

కూల్‌డ్రింక్ అనుకుని పురుగుల మందు తాగిన చిన్నారి

పరిస్థితి విషమం

వాకాడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్టెంబాక సమీపంలో ఉన్న రొయ్యల గుంటల వద్ద రెండేళ్ల చిన్నారి కూల్‌డ్రింక్ అనుకొని పొలాల్లో పడి ఉన్న పురుగుల మందు తాగింది. చిన్నారి మామ తెలిపిన వివరాల మేరకు... చిట్టమూరు మండలం గునపాడు ఎస్టీ కులానికి చెందిన నరేష్ కుటుంబం ముట్టెంబాక గ్రామంలోని ఓ రొయ్యల గుంటల వద్ద పనిచేస్తోంది. ఆదివారం నరేష్ కుమార్తె వెంకటమ్మ (2) పొలాల్లో ఆడుకుంటూ పురుగుల మందు డబ్బాను చూసి కూల్‌డ్రింక్ అని తాగేసింది. గమనించిన చిన్నారి అక్క తల్లిదండ్రులకు తెలిపింది. వెంటనే చిన్నారిని వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

వేణుంబాక సర్పంచు ఆత్మహత్య



సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం వేణుంబాక సర్పంచు తామర్ల సుబ్రహ్మణ్యం(60) ఆత్మహత్య చేసుకున్నాడు. వేణుంబాక గిరిజన కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం కుటుంబ కలహాలతో ఆదివారం గుళికలు మందు తిన్నాడు. నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

రేపు డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీసిటీలోని సీసీఎల్, బ్లూస్టార్, వీల్స్ ఇండియా కంపెనీలు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ తెలిపారు.

నేడు తుమ్మూరులో వైద్య శిబిరం

నాయుడుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట తుమ్మూరులో సోమవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా తెలిపారు. ఎల్‌ఏ సాగరం, తుమ్మూరు అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్య సిబ్బంది పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేస్తారన్నారు.





గ్రావెల్ తవ్వడంతో ఏర్పడిన భారీ గుంతలు - డంపింగ్ చేసిన గ్రావెల్, అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్న వీఆర్వో శ్రీదేవి

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

- పేదల ఇంటి స్థలాలనూ వదలని అక్రమార్కులు
- అడ్డుకున్న వీఆర్వోపై చిందులు
- పట్టించుకోని పోలీసులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను తవ్వి పరిశ్రమలకు, వెంచర్లకు తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో శ్రీకాళహస్తి రోడ్డు పక్కన ఉన్న జగనన్న లేఅవుట్‌లో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రి వేళల్లో ఇటాచీ, ఎక్స్‌కవేటర్ల సాయంతో గ్రావెల్‌ను తవ్వి మరోచోటుకు తరలించి డంపింగ్ చేస్తున్నారు. అక్కడ నుంచి టిప్పర్ల సాయంతో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మన్నారు పోలూరులో పేదలకు ఇళ్లు నిర్మించేందుకు 40 ఎకరాల్లో రెండు లే అవుట్‌లు నిర్మించారు. ఈ ప్రాంతంలో దొరికే గ్రావెల్‌కు మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కులు ఇంటి స్థలాల్లోనూ తవ్వి తీసుకెళ్లిపోతున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఇంటి స్థలాల్లో గ్రావెల్ తవ్వి మన్నారుపోలూరు చీపురుగుంట సమీపంలోని పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ లే అవుట్‌లో డంపింగ్ చేశారు. అక్కడ టిప్పర్లకు లోడుచేసి సూళ్లూరుపేట సమీపంలో ఉన్న పరిశ్రమలకు, వెంచర్లకు తరలిస్తున్నారు. రెవెన్యూ, పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చినా అటువైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. చివరికి వీఆర్వో శ్రీదేవికి ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటలకు తహశీల్దార్‌కు తెలియజేశారు. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రావెల్ డంపింగ్ చేసిన ప్రదేశానికి వెళ్లి వెనుతిరిగి వచ్చేశారు. ఉదయం 9గంటల సమయంలో డీఎస్పీకి సమాచారం అందించడంతో మళ్లీ పోలీసులు వెళ్లి గ్రావెల్‌ను తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని ఇటాచీని వదిలేసి వెళ్లిపోయారు.



గ్రావెల్ తవ్వకాలను నిషేధిస్తూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

హెచ్చరిక బోర్డులు పెట్టినా..

ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూముల్లో గ్రావెల్ తవ్వితే క్రిమినల్ చర్యలు తీసుకొంటామని తహశీల్దార్ హెచ్చరిక బోర్డు పెట్టినా అక్రమార్కులు లెక్క చేయలేదు. బోర్డు పక్కనే దారి ఏర్పరచుకొని దర్జాగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. గ్రావెల్ మాఫియాలో అంతా వైసీపీకి చెందిన వారేనని, వారికి అధికార పార్టీకి చెందిన ముఖ్యనేతలతో సఖ్యత ఉండడం వల్లే దందా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వీఆర్వోపై చిందులు..

గ్రావెల్ దందాను అడ్డుకొన్న వీఆర్వోపై అక్రమార్కులు చిందులు వేయడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. మా లారీని పట్టుకొంటారా... ఇప్పుడు నీకు ఫోన్ వస్తుంది చూడు అంటూ ఆవేశంతో ఊగిపోయారు. ఫిర్యాదును మార్చి ఇవ్వమని వీఆర్వోపై పోలీసులు ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. గ్రావెల్ తవ్వకానికి తెచ్చిన ఇటాచీని పోలీసులు వదిలేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

బడికెళ్లాలంటే ఏరు దాటించాల్సిందే

రుద్రవరంవాసుల జల సాహసాలు



పిల్లలను ఏరు దాటిస్తున్న తల్లిదండ్రులు

కోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో పంచాయతీ కేంద్రమైన రుద్రవరం గ్రామస్తులకు స్వర్ణముఖినది యమ పాశంలా మారింది. గ్రామంలో 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాల ఉంది. 6 నుంచి 10 తరగతులు చదువుకునేందుకు సమీపంలో ఎక్కడా ఉన్నత పాఠశాల లేదు. 12 కిలోమీటర్లు ప్రయాణించి చిట్టేడు ఉన్నత పాఠశాలకు వెళ్లాలి. లేదా 9 కిలోమీటర్లు ప్రయాణించి చిట్టమూరు మండలం గునపాడు ఉన్నత పాఠశాలకు వెళ్లాలి. అయితే చిట్టమూరు మండలంలోని మెట్టు ఉన్నత పాఠశాల ఒకటిన్న కిలోమీటరు దూరంలో ఉన్నా అక్కడకు వెళ్లడానికి దారిలేదు. స్వర్ణముఖినది దాటితే పాఠశాలకు వెళ్లొచ్చు. ఎండాకాలం అయితే విద్యార్థులు ఏటిలో నడుచుకుంటూ వెళ్లిపోతారు. ఇబ్బందులన్నీ వానాకలంలోనే. అక్టోబరు నుంచి మార్చి వరకు స్వర్ణముఖినదిలో నీళ్లు పుష్కలంగా ఉంటాయి. ఇటీవల కురిసిన వర్షాలతో స్వర్ణముఖినది ప్రవాహం కొనసాగుతోంది. దీంతో రుద్రవరం గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 20మంది పిల్లలు ఉండగా రోజుకు ఇద్దరి తల్లిదండ్రులు చొప్పున వంతులు వేసుకొని అతి కష్టంపై ఏటిలో నడుచుకుంటూ వెళ్లి విద్యార్థులను నది దాటించి మెట్టు ఉన్నత పాఠశాలకు పంపుతున్నారు. సాయంత్రం కూడా తల్లిదండ్రులు నది అవతలకు వెళ్లి పిల్లలను తీసుకురావాల్సిందే. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు నది దాటుతున్న సమయంలో ఇద్దరు పశువుల కాపర్లు, ముగ్గురు విద్యార్థులు, నలుగురు గ్రామస్తులు ప్రాణాలు కోల్పోయారు. స్వర్ణముఖినదిపై వంతెన నిర్మించి తమ ప్రాణాలను కాపాడాలని ఎన్నో ఏళ్ల నుంచి ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా తమ సమస్య పరిష్కరించాలని రుద్రవరం గ్రామస్తులు కోరుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బలిజ సంఘం మండల కన్వీనర్ దొంతి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మునిశేఖర్, మహిపాల్, భీమన శ్రీధర్, కొట్టే గిరి, తోట రమేష్, శంఖు సురేష్, సుంకర ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతకు పొంగళ్లు



పొంగళ్లు పెట్టేందుకు వెళ్తున్న గ్రామస్తులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరిమిటిపాడులో గ్రామదేవత ముప్పాలమ్మకు ఆదివారం గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. ఇళ్ల వద్దనుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని ఫ్లైఓవర్‌పై కారు వేగంగా వెళుతూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. అయితే కారులోని వారికి ఎటువంటి గాయాలూ కాలేదు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం

తిరుచానూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్ర పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవర్లకు వేడుకగా అభిషేకం జరిగింది. ఉభయదేవేరిలతో పాటు స్వామివారికి ఆదివారం రాత్రి తిరువీధి ఉత్సవం జరిగింది. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవ రాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్ నాయుడు, చలపతి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



శివ(ఫైల్‌ఫొటో)

దక్కిలి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెలికల్లు గ్రామానికి చెందిన పొట్టి శివ(24) ఆదివారం మృతి చెందారు. గత నెల జనవరి 1వ తేదీన వెలికల్లు గ్రామానికి చెందిన చెలికం శ్రీనివాసులు రెడ్డి, శివ రాపూరు నుంచి వెలికల్లు గ్రామానికి మోటారు బైక్‌పై వెళ్తుండగా సిద్దవరం గ్రామం వద్ద ప్రమాదానికి గురయ్యారు. చెలికం శ్రీనివాసులురెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా శివ తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న శివ ఆదివారం తెల్లవారు జామును మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించాలి

గూడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వచ్చి ప్రమాదవశాత్తు మృతి చెందిన పాపయ్య కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థికసాయం అందించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ చిల్లకూరు మండలం తిమ్మనగారిపాళెం గ్రామానికి చెందిన పాపయ్య శనివారం గూడూరులోని ఓ భవనంలో పనులు చేస్తుండగా గోడ కూలి మీద పడడంతో మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుడి కుటుంబానికి భవన యజమాని ఆర్థికసాయం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, శంకయ్య, జిలానీ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శుక్రవారం నాటి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 80,871 మంది భక్తులు దర్శించుకున్నారు.

డ్రోన్‌లపై శిక్షణ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసులకు డ్రోన్ల నిర్వహణపై ఆదివారం తిరుపతిలో శిక్షణ ఇచ్చారు. వారం రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతుల్లో రెండవ బ్యాచ్‌కు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం కూడలి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ దశరథ రామయ్య(35) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామానికి చెందిన దశరథరామయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మల్లాం కూడలి వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేత కుటుంబాలకు పరామర్శ



గోపాల్‌ను పరామర్శిస్తున్న నెలవల తదితరులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మల్లు గోపాల్ కుటుంబసభ్యులను సూళ్లూరుపేట ఇన్‌చార్జి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఆదివారం మల్లు గోపాల్ తల్లి వెంకటసుబ్బమ్మ మృతి చెందడంతో ఆమె మృతదేహానికి నెలవల సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెలవల వెంట టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, నాయకులు కృష్ణయ్య, శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. చేతికందే ఎత్తులో ఏర్పాటు చేయడంతో తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు కూడా చేతి కందేలా ఉండడంతో మూగజీవాలు విద్యుదాఘాతానికి గురవుతున్నాయి. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

పడకేసిన నిఘా

రెండు నెలల్లో 10 చోరీలు

మొన్న దామినేడులో కల్తీ మద్యం తయారీ కలకలం

నేడు సీపీఆర్ విల్లాస్‌లో చోరీ

వరుస ఘటనలతో హడలిపోతున్న నగర ప్రజలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు నిఘా పడకేసింది. రాత్రిపూట బీట్‌లు పూర్తిగా కనిపించడం లేదు. కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న దామినేడు బ్లాక్ నెంబరు 61లో నాలుగేళ్లుగా నకిలీ మద్యం తయారు చేసే ముడిపదార్థాలు స్టాక్ ఉంచుతున్నా పోలీసులు గుర్తించలేకపోవడం, శనివారం అర్ధరాత్రి వేదాంతపురం విల్లాస్‌లోని 81, 82 ఇళ్లలో దొంగలు చొరబడి చోరీ చేయడం దీనికి ఉదాహరణలుగా చెప్పొచ్చు. అలాగే తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, శ్రీకాళహస్తి పరిధిలో రెండు నెలల్లో 10 చోరీలు జరగడం పోలీసుల పనితీరును చెబుతోంది.

కనిపించని కార్డెన్ సెర్చ్‌లు

ఇటీవల కాలంలో తిరుపతి, తిరుచానూరులో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించిన దాఖలాలు లేవు. గతంలో ఆయా స్టేషన్ల పరిధిలో డైనమిక్ బీట్లు, రాత్రి గస్తీలు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించేవారు. ఐదారేళ్లుగా రాత్రి గస్తీలు, పెట్రోలింగ్, రక్షక్ మొబైల్ తనిఖీలు లేవు. కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించి ఉంటే కల్తీ మద్యం తయారీ ముడిపదార్థాల నిల్వలు ముందే పట్టుబడి ఉండేవి. అసాంఘిక శక్తులకు అడ్డాగా ఉన్న పాడిపేట, దామినేడు, బాలాజీ డెయిరీ, జీవకోన, సత్యనారాయణపురం, బీటీఆర్ కాలనీతో పాటు శివారు ప్రాంతాల్లో కనుచూపు మేరలో కార్డెన్ సర్చ్‌లు నిర్వహించిన దాఖలాలు లేవు. అందుకే చోరీలు పెరుగుతున్నాయని ఆయా ప్రాంతాల వారు అభిప్రాయ పడుతున్నారు. అంతేగాక తిరుపతిలో 12 ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు పేట్రేగిపోతున్నాయి. ముఖ్యంగా తిరుచానూరు ప్రాంతంలో భద్రతాపరంగా డొల్లతనం కనిపిస్తోంది.